PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 223 | విజయవాడ, ఆదివారం 16 మార్చి 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 16 March 2025 | Rs

'అణు' కుంపటి వద్దు

- న్యూక్లియర్ పవర్‌ప్లాంట్‌కు ఎన్‌టిపిసి యోచన
- ఆలోచన విరమించుకోవాలని సిపిఎం డిమాండ్

2


ముంబయి జట్టు ఆనందహేల

డబ్ల్యుపిఎల్ టైటిల్ విజేత ముంబయి


హర్మన్ ప్రీత్ కౌర్(66)

ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) టైటిల్‌ను హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబయి ఇండియన్స్ చేజిక్కించుకుంది. బ్రాబౌర్న్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌లో శనివారం జరిగిన ఫైనల్లో ముంబయి జట్టు ఎనిమిది పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 149 పరుగులు చేయగా.. అనంతరం ఢిల్లీ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 141 పరుగులే చేయగల్గింది. ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(66) అర్ధసెంచరీకి తోడు స్కీవర్ బ్రంట్(30) బ్యాటింగ్‌లో రాణించారు. బౌలింగ్‌లోనూ స్కీవర్(3/30) రాణించి ముంబయి జట్టు టైటిల్‌ను చేజిక్కించుకోవడం లో కీలకపాత్ర పోషించింది. దీంతో తొలిసారి టైటిల్ ముద్దాడాలన్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆశలు అడియాశలయ్యాయి. మెగా టోర్నీ ఆరంభం నుంచి అదరగొట్టే ప్రదర్శనతో నేరుగా ఫైనల్‌కు చేరిన మెగ్ లానింగ్ సారథ్యంలోని ఢిల్లీ జట్టుకు టైటిల్ పోరులో ముంబయి జట్టు ఝలక్ ఇచ్చింది. లీగ్ దశలోనూ ఆడిన రెండు మ్యాచు ల్లోనూ ఢిల్లీ చేతిలో ఓడిన ముంబయి ఫైనల్లో సమిష్టిగా రాణించి టైటిల్‌ను ఎగరేసుకు పోయింది. డబ్ల్యుపిఎల్ సీజన్-3 టైటిల్‌ను చేజిక్కించు కున్న ముంబయి ఇండియన్స్‌కు ఇది రెండో టైటిల్. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ లీగ్ దశలో ఆడిన 8మ్యాచుల్లో 5మ్యాచుల్లో గెలిచి నేరుగా ఫైనల్‌కు చేరు కోగా.. 12న జరిగిన ఎలిమినేటర్‌లో ముంబయి జట్టు 47పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్‌ను చిత్తుచేసి తుది పోరుకు సిద్ధమైంది. మరోవైపు ముంబయి జట్టు ఈ సీజన్‌లో ఆడిన 8మ్యాచుల్లో 5మ్యాచుల్లో నెగ్గినా రన్‌రేట్‌లో వెనుకబడి ప్లే-ఆఫ్ మ్యాచ్ ఆడింది. దీంతో ఫిబ్రవరి 14న వడోధర వేదికగా గుజరాత్ జెయింట్స్, బెంగళూరు జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌తో సీజన్-3 డబ్ల్యుపిఎల్ టోర్నీ ప్రారంభమై, శనివారం ముంబయి-ఢిల్లీ జట్ల మధ్య ముంబయిలోని రాయ్‌పూర్‌లో జరిగిన ఫైనల్‌తో ముగిసింది.

- ఉత్కంఠపోరులో ఢిల్లీపై ఎనిమిది పరుగుల తేడాతో గెలుపు
- హర్మన్‌ప్రీత్ అర్ధసెంచరీ
- స్కీవర్ బ్రంట్ ఆల్‌రౌండ్ ప్రదర్శన


మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్యాకేజీ పేరుతో మోసం

- విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఒరిగిందేమీ లేదు
- అది బ్యాంకుల అప్పులకే తప్ప కర్మాగార రక్షణకు కానేకాదు
- ప్రైవేటీకరణ విరమించి విశాఖ 'ఉక్కు'ను సెయిల్‌లో విలీనం చేయాలి
- సొంత గనులు కేటాయించాలి : బివి రాఘవులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ మోసపూరితమైనదని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. ఈ ప్యాకేజీ వల్ల 'ఉక్కు' కార్మికులకు ఒరిగిందేమీ లేదని తెలిపారు. తొలుత అది ప్లాంట్‌ను నిలబెట్టడానికి అనుకున్నారని, రాష్ట్రంలోని టిడిపి అదంతా తమ నాయకుడు చంద్రబాబు గొప్పతనం అంటూ ప్రచారం చేసిందని, తీరా చూస్తే ప్లాంట్‌ను రక్షించడానికో, ఉద్యోగుల కోసమో కాకుండా బ్యాంకుల అప్పుల కోసం మాత్రమే అది ఇచ్చారని స్పష్టమైందని తెలిపారు. శనివారం ఆయన విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సిపిఎం విశాఖ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. తొలుత కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. విశాఖ ఉక్కుకు ఊతమివ్వని ప్యాకేజీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్మికులకు అన్నింటా అన్యాయం జరుగుతోందన్నారు. అనంతరం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడులతో కలిసి రాఘవులు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ నిలదొక్కుకోవాలంటే సొంత గనులు ఇవ్వాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, గతంలో కేంద్ర కేబినెట్ చేసిన వంద శాతం స్ట్రాటజిక్ సేల్ ప్రకటనను రద్దు చేస్తూ పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ప్రకటన చేయాలని, అందుకు టిడిపి కూటమి నేతలు కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాటానికి సిపిఎం ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుందన్నారు. ప్యాకేజీ వల్ల కార్మికులకు, ప్లాంట్‌కు ఒనగూరేదేమీ లేదని తెలిపారు. ఇనుప ఖనిజాన్ని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వకుండా మిట్టల్‌కు గ్యారెంటీ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి రావాలంటే రూ.9 వేల కోట్లను వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణమే ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అదనంగా కోకోఓవెన్ బ్లాస్ట్ ఫర్నేస్‌ను నడిపించాలని కోరారు. వేల సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు పూనుకుంటున్నారని, తక్షణమే ఆ ప్రక్రియను నిలిపివేయాలని, కార్మిక నాయకులకు ఇచ్చిన అక్రమ షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని, నిర్బంధాలకు పూనుకోవడం విడనాడాలని డిమాండ్ చేశారు.

సెకీ ఒప్పందంపై చంద్రబాబు ప్రకటన హాస్యాస్పదం

గత ప్రభుత్వ కాలంలో కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు సెకీ ద్వారా అదానీ సంస్థలతో చేసుకున్న అక్రమ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం మిగతా 7లో

ప్రజలపై భారాలు వేసే ఒప్పందాలకు వ్యతిరేకంగా విద్యుత్ కార్యాలయాల ముందు 28న ధర్నా

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- 'విద్యుత్ షాకులు' పుస్తకావిష్కరణ
- జగన్ అవినీతికి చంద్రబాబు వత్తాసు

3

అక్టోబర్ నుంచి ఆకస్మిక తనిఖీలు

- అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలనతో ముందుకు
- తణుకు 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో చంద్రబాబు
- మున్సిపల్ కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చిన సిఎం



ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

అక్టోబర్ రెండో తేదీ తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని, తాను వచ్చే విషయం రెండు, మూడు గంటల ముందు మాత్రమే చెబుతానని, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే జిల్లా కలెక్టర్, అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుందని, ఎంఎల్‌ఎలు, అధికారులు పరుగులు తీయాల్సిందేనని అన్నారు. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలనతో ముందు కెళ్తామని తెలిపారు. 47 ఏళ్ల క్రితం ఇదే రోజు తాను మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టానని, ఈ రాష్ట్రంలో ఎవరికీ దక్కని అసాధారణ గౌరవం తనకు దక్కిందని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శనివారం ఆయన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు హెలికాప్టర్‌లో తణుకు చేరుకున్న సిఎంకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి మిగతా 7లో

'హిందీ'కి పవన్ వత్తాసుపై సర్వత్రా ఆగ్రహం

- బలవంతంగా రుద్దితే సహించబోమని డిఎంకె పునరుద్ఘాటన
- నాడు జనసేనాని.. నేడు భజన సేనాని : ప్రకాష్‌రాజ్ కౌంటర్



ఉత్తర భారత రాజకీయ నాయకత్వం దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకొని, గౌరవించాలంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన ట్వీట్‌ను ప్రకాశ్ రాజ్ తన పోస్టుకు జత చేశారు. గెలవక ముందు 'జన సేనాని', గెలిచిన తర్వాత 'భజన సేనాని' అంతేనా అంటూ ఆయన ఎద్దేవా చేశారు.

చెన్నయ్ : జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాషకు వత్తాసు పలుకుతూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రాజేస్తున్నాయి. ప్రత్యేకించి తమిళనాడును లక్ష్యంగా చేసుకొని ఆయన మాట్లాడిన తీరు పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. పవన్ వ్యాఖ్యలపై ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) అధికార ప్రతినిధి సయీద్ హాఫీజుల్లా స్పందిస్తూ జాతీయ విద్యా విధానం (ఎన్‌ఇపి) ముసుగులో హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నాలను తాము సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పవన్ కల్యాణ్ తమిళనాడు ప్రభుత్వ వైఖరిని తప్పుగా అర్థం చేసుకున్నారని, ఇతర భాషలు నేర్చుకునేందుకు తాము వ్యతిరేకం కానేకాదని, అయితే తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దుతున్నారని.. దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హాఫీజుల్లా తెలిపారు. వ్యక్తిగతంగా హిందీ, ఇతర భాషలు నేర్చుకోవడాన్ని తామెన్నడూ అడ్డుకోబోమని ఆయన తెలిపారు. హిందీ నేర్చుకోవడాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా తమ రాష్ట్రంలో హిందీ ప్రచార సభలను కూడా నిర్వహిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎన్‌ఇపి, పిఎంశ్రీ పాఠశాలల ముసుగులో తమిళులు, ఇతర దక్షిణాది రాష్ట్రాల ప్రజలపై బలవంతంగా హిందీ భాషను రుద్దుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఈ వినాశకరమైన వైఖరిని తాము వ్యతిరేకిస్తున్నామని, పవన్ కల్యాణ్‌కు ఇది కూడా అర్థం కానట్టు ఉందని హాఫీజుల్లా ఎద్దేవా చేశారు.

పవన్ అప్పటికి పుట్టి ఉండరు : ఎళన్‌గోవన్

తమిళ భాష మనుగడ కోసం తాము దశాబ్దాల కిందట నుంచే పోరాడుతున్నామని, అప్పటికి పవన్ కల్యాణ్ పుట్టి ఉండరని డిఎంకె మరో సీనియర్ నేత టికెఎస్ ఎళన్‌గోవన్ అన్నారు. 1938 నుంచే తమిళులపై హిందీ భాష బలవంతంగా రుద్దడాన్ని తాము వ్యతిరేకిస్తూ వచ్చామన్నారు. తమిళనాడులో ద్విభాషా విధానాన్నే అమలుచేస్తామని ఇప్పటికే శాసనసభలోనూ సబంధిత చట్టాన్ని ఆమోదించుకున్నామని ఆయన చెప్పారు. విద్యా నిపుణుల సలహాలు, సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని, అంతేగానీ.. సినీనటులు, రాజకీయ నాయకుల అభిప్రాయాలతో ఏకీభవించాల్సిన అవసరం లేదని తెలిపారు. ద్విభాషా సూత్రాన్ని అమల్జేయాలని 1968లో బిల్లు ఆమోదించినప్పుడు ఈ పవన్ కల్యాణ్ ఇంకా పుట్టి ఉండరని మిగతా 7లో

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానంపై 18న ఇసి భేటీ

న్యూఢిల్లీ : ఓటర్ గుర్తింపు కార్డుతో ఆధార్ కార్డును అనుసంధానించడం (లింక్ చేయడం)పై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) ఈ నెల 18న సమావేశం నిర్వహించనుంది. ఈ అంశంపై భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ ఖుమార్, ఇతర కమిషనర్లు కలిసి కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, లెజిస్లేటివ్ విభాగ కార్యదర్శి రాజీవ్ మణి, ఆధార్ అధీకృత సంస్థ యుఐడిఎఐ సిఇఓ భువనేష్ కుమార్ చర్చించనున్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణ చేసిన తర్వాత ఆధార్‌ను ఓటర్ కార్డుకు అనుసంధానించారు. ఆ తర్వాత స్వచ్ఛంద ప్రాతిపదికన ఓటర్ల నుండి ఆధార్ నెంబర్లను సేకరించడం ఇసి ప్రారంభించింది. ఇప్పటికీ ఇసి ఇంకా రెండు డేటాబేస్‌లను అనుసంధానించాల్సివుంది. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు బూటకపు రిజిస్ట్రేషన్లను కనిపెట్టేందుకు ఈ ప్రక్రియ చేపట్టారు. అయితే పశ్చిమ బెంగాల్‌లో, ఇతర రాష్ట్రాల్లో ఓటర్లకు ఒకే ఎపిక్ (ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డు) నెంబరును కలిగివున్నారంటూ విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.

కార్పొరేట్లకు భూపందేరంపై హెచ్‌సియు విద్యార్థుల ఆగ్రహం

- భూముల్లోకి ప్రవేశించి నిరసన
- రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటమ్

ప్రజాశక్తి - హైదరాబాద్

సరళీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా కార్పొరేట్లకు విచ్చలవిడిగా సాగుతున్న భూ పందారంపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టాలని భావించిన భూముల్లోకి ఒక్కసారిగా ప్రవేశించి నిరసన వ్యక్తం చేశారు. సర్కారు వైఖరి మార్చుకోకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సేరిలింగంపల్లి మండలంలోని కంచా గచ్చిబౌళిలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల స్థలాన్ని వేలం వేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిఎస్‌ఐఐసి) ఈ మేరకు విడుదల చేసిన వేలం నోటిఫికేషన్‌లో ఈ భూముల విలువను 10వేల కోట్ల రూపాయలుగా పేర్కొంది. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండి భవిష్యత్ అవసరాలకు, పర్యావరణానికి ఎంతగానో ఉపయోగపడే ఈ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థుల్లో కలకలం రేపింది. ఎస్‌ఎఫ్‌ఐ హెచ్‌సియు యూనిట్ సవివరమైన కరపత్రాన్ని ముద్రించి, విస్తృతంగా ప్రచారం చేసింది. దీంతో విశ్వవిద్యాలంలో ఈ విషయం చర్చనీయాంశమైంది.

ఆందోళనలు..ధర్నాలు

విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘంగానే ఈ విషయాన్ని తేల్చుకోవాలని విద్యార్థులు నిర్ణయించారు. దానిలో భాగంగా క్యాంపస్‌లో ఆందోళనలకు, ధర్నాలకు దిగారు. మూడు,నాలుగు రోజులు నుండి సాగుతున్న ఈ ఆందోళనలో వివిధ విద్యార్థి సంఘాలతో పాటు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు కూడా మద్దతుగా తెలిపారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిలో కొందరు ప్రత్యక్షంగా కూడా ఆందోళనలో భాగస్వాములయ్యారు. అయినా, ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేకపోవడంతో వందలాది మంది విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఒక్కసారిగా వేలం వేయాలని నిర్ణయించిన భూముల్లోకి ప్రవేశించారు. వేలం నిర్ణయాన్ని ఉపసంహరించి, భూములను విశ్వవిద్యాలయానికి శాశ్వతంగా అప్పచెప్పాలని ఈ సందర్భంగా వారు నినదించారు. ప్రభుత్వం స్పందించకపోతే వేలం పాటను అడ్డుకుంటామని ప్రకటించారు.


మష్రూమ్ కొండ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మొదటి నుండి కన్ను!

హెచ్‌సియుకు ఉన్న వేలాది ఎకరాల భూమిపై ఎప్పటి నుండో కార్పొరేట్ సంస్థల కన్ను పడింది. 1974లో ఈ వర్శిటీని ఏర్పాటు చేసినప్పుడు 2,300 ఎకరాల భూమిని విద్య, పరిశోధన అవసరాల కోసం అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రారంభమైన మిగతా 7లో

పవన్‌కైనా అర్థమైందా?

- పిఠాపురం సభపై అంబటి రాంబాబు
- అవకాశవాదంలో బాబును మించారని వ్యాఖ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిఠాపురంలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభలో 'పవన్ మాట్లాడిందేమిటో పవన్‌కైనా అర్థమైందా?' అని మాజీ మంత్రి, వైసిపి నేత అంబటి రాంబాబు ప్రశ్నించారు. వైసిపి కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ సూపర్‌సిక్స్‌తోపాటు ఇతర హామీలను ఎందుకు ప్రస్తావించలేదని అన్నారు. 'పవన్ పూర్తిగా అయోమయంగా మాట్లాడారు. ఏం మాట్లాడారో ఆయనకే తెలియలేదు' అని అన్నారు. అవకాశవాదంలో పవన్‌కల్యాణ్ చంద్రబాబును మించిపోయాడని చెప్పారు. వారసత్వ, కుటుంబ రాజకీయాలపై గతంలో పెద్ద పెద్ద ప్రకటనలు చేసిన పవన్ ఇప్పుడు ఎందుకు వాటిపై మాట్లాడలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ అవినీతిలో చెలరేగిపోతున్నాడని అన్నారు. జనసేన ఎమ్మెల్యేలు దోచుకుంటుంటే ఆయనకు కనబడడం లేదని చెప్పారు. గతంలో గొంతు చించుకున్న పవన్ ఇప్పుడు అవినీతిని స్వాగతిస్తున్నాడా అని ప్రశ్నించారు. పిఠాపురంలో గెలిపించిన వర్మను నీ ఖర్మ అన్నారని, 21 సీట్లిచ్చి గెలిపించిన ప్రజలను కూడా గాలికొదిలేశారని పేర్కొన్నారు. టిడిపి బి టీమ్‌గా జనసేన పనిచేస్తోందని తొలి నుండి తాము చెబుతున్నదే నిజమైందని పేర్కొన్నారు. గతంలో తమకు మత విశ్వాసాలు లేవని, తన తండ్రి నాస్తికుడని చెప్పిన పవన్ ఇప్పుడు ఆయన రామనామ స్మరణ చేసేవాడని చెబుతున్నారని అన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం తండ్రి వ్యక్తిత్వాన్ని బజారున పెట్టారని మండిపడ్డారు. 100 శాతం స్ట్రైక్ రేట్ అని చెబుతున్న పవన్ గెలిచిన ఎమ్మెల్యేలు ఎంతమందో చెప్పాలన్నారు. వారంతా టిడిపి నుండి వచ్చినవారనే విషయాన్ని మర్చిపోయినట్లు ఉన్నారని పేర్కొన్నారు. దక్షిణాది మీద ఉత్తరాది పెత్తనం అని గతంలో గొంతుచించుకున్న పవన్ నేడు కాషాయం ధరించి యూటర్న్ తీసుకున్నారని చెప్పారు. తనకు తానే ఉత్తరాది పార్టీకి దక్షిణాది లీడర్‌గా ముద్ర వేసుకుంటున్నాడని విమర్శించారు. పిఠాపురంలో వర్మను వాడుకుని వదిలేశారని అన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ మారినంత మాత్రాన నోరుజారితే ఎలాగని అన్నారు.

లేబర్ కోడ్లతో బానిసత్వం

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

విశాఖలో మెడికల్ రిప్స్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాల స్థానే తీసుకొచ్చిన లేబర్ కోడ్లతో బానిసత్వం వచ్చే అవకాశం ఉందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలకు పూనుకుందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (సిఐటియు) రెండు రోజుల రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. తొలుత యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కుమార్ పతాకావిష్కరణ చేశారు. హాజరైన ప్రతినిధులకు రిసెప్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బరాజు స్వాగతం పలికారు. ప్రధాన వక్తగా హాజరైన ఎవి.నాగేశ్వరరావు ఈ సమావేశాలను ఉద్దేశించి మాట్లాడుతూ.. హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ రిప్స్ నిర్వహిస్తున్న పోరాటాలు అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రమాదకర చట్టాలను పోరాటాలతో తిప్పికొట్టాలని కోరారు. జిల్లా పూర్వ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. డాక్టర్ ఎస్కెఇ.అప్పారావు మాట్లాడుతూ ప్రజల రోగాల పట్ల ప్రభుత్వం వెంటనే కళ్లు తెరవాలని, విద్య, వైద్యానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ కార్మిక హక్కులు, ప్రజాస్వామ్యం, లౌకిక రాజ్యం, ఫెడరల్ వ్యవస్థను తుంగలోకి తొక్కిన కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను విదేశీయులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. దీన్ని అడ్డుకోవడానికి ఉద్యమాలే మార్గమన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకటరావు మాట్లాడుతూ మందుల ధరలు తగ్గించాలని, వాటిపై ఉన్న పన్నులు ఎత్తివేయాలని, ప్రజలకు మందులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం సంయుక్త ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ నకిలీ, నాసిరకం మందులను అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా మెడికల్ రిప్స్‌గా దీర్ఘకాలం పని చేసి రిటైర్ అయిన పలువురిని సత్కరించారు. ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జి.వరప్రసాద్, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు టి.కామేశ్వరరావు తదితరులు సౌహార్ద్ర సందేశాలిచ్చారు.



జనరల్ కౌన్సిల్ సమావేశాల ప్రారంభంలో జెండాను ఆవిష్కరించి నినదిస్తున్న మెడికల్ రిప్స్

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయం

- ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి సాగర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని ఆల్ ఇండియా కిసాన్ సభ సహాయ కార్యదర్శి టి సాగర్ తెలిపారు. మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో యువ రైతులు, మహిళా రైతుల రాష్ట్ర స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాగర్ మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక మొత్తంలో కోతలు పెట్టిందన్నారు. ఎరువుల సబ్సిడీకి కేటాయించాల్సిన నిధుల్లో 23 శాతం తగ్గించారని చెప్పారు. రైతులకు అందించే ఇతర పలు సబ్సిడీలు తగ్గించారన్నారు. ఈ కారణంగా రైతాంగానికి సేద్యం మరింత భారం కానుందన్నారు. ఒకవైపు కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్లు రుణాలు రద్దు చేసిన మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగంపై ఉన్న పంట రుణ భారం తగ్గించడానికి అంగీకరించలేదని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్, భూములు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేలా కొత్త చట్టాలను చేస్తూ... చిన్న, సన్నకారు రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని తెలిపారు. రైతాంగం తమ పంటలకు మద్దతు ధరలు సి2ం50 శాతం ఫార్ములా ప్రకారం ప్రకటించి, దీనికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ 2020 నుంచి పోరాటాలు చేస్తున్నా పట్టించుకోని మోడీ, రైతాంగానికి నష్టం చేసే ఎన్ఆర్‌పిఎఫ్ఎం వంటి నూతన చట్టాలతో మళ్లీ నల్ల చట్టాల్లోని అంశాలనే ముందుకు తెస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబు ఇవే విధానాలను అతి వేగంగా అమలు చేస్తూ, రైతాంగానికి ద్రోహం చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలపై రైతాంగం పోరాడి, వాటిని తిప్పి కొట్టాలని, అందుకు యువ రైతులు ముందుకు రావాలని కోరారు. వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోవడానికి కారణమైన విధానాలను మార్చుకోవడానికి నడుం కట్టాలని పిలుపునిచ్చారు. రైతుల్లో సగభాగంగా ఉంటున్న మహిళా రైతులు కూడా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. వ్యవసాయంలో మహిళల శ్రమ ఎక్కువగా ఉందని, పాల ఉత్పత్తిలోనూ మహిళల పాత్ర 80 శాతం ఉంటుందని అన్నారు. అటువంటి మహిళలు ఏ విధమైన హక్కులు లేకుండా ఉన్నారని చెప్పారు. కుటుంబ పోషణ, వ్యవసాయం, పశుపోషణ, అన్నింటికీ ముందు నిలుస్తున్నా ఈ నాటికి వారికి భూమిపై హక్కులు ఉండటం లేదన్నారు. మహిళలు సంఘటితమై రైతు సంఘాల్లో చేరి బలమైన ఉద్యమాలతో మార్పునకు నడుం కట్టాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయే కాలంలో పాల రైతుల సమస్యలు, మార్కెట్ సమస్యలు, బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా యువ, మహిళా రైతులు రైతు సంఘాల్లో చేరి పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, వై కేశవరావు, పి హేమలత, ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు జొన్న శివశంకర్, ఎ రాజశేఖర్, పివి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



యువ రైతులు, మహిళా రైతుల రాష్ట్ర స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

- ముఖ్యమంత్రికి ఎపిజిడబ్ల్యువియు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని, వేతన బకాయిలు చెల్లించాలని, నెలకు రూ.10 వేల వేతన హామీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి శనివారం లేఖ రాశారు. వలంటీర్ల సమస్యలపై ఈ నెల 17న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

వీరి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వలంటీర్లకు సంబంధించిన విధి విధానాలను వెంటనే ప్రకటించాలని, బలవంతంగా రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. డిగ్రీ, పిజి చదివిన వారు కూడా వలంటీర్లుగా పని చేస్తున్నారని చెప్పారు. కేవలం రూ.5 వేలు గౌరవ వేతనానికి ఐదేళ్లు పని చేయడానికి లక్షల మంది సిద్ధపడ్డారంటే నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో ఉందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం వలంటీర్లకు వేతనాలు పెంచకుండా భ్రమల్లోనే చాకిరీ చేయించిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్లకు రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినందున వెంటనే అమలు చేయాలన్నారు. వలంటీర్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు చెల్లించాలని పలుమార్లు కోరినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. రెండున్నర లక్షల మంది వలంటీర్ల కుటుంబాలు గత 9 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని పేర్కొన్నారు.

ఒపిఎస్ కోసం ఉద్యమించాలి

- ఎఐఎల్ఆర్ఎస్ఎ సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) పునరుద్ధరణే లక్ష్యంగా ఉద్యమించాలని ఎఐఎల్ఆర్ఎస్ఎ నేతలు పిలుపునిచ్చారు. విజయవాడ డివిజన్‌కమిటీ ఆధ్వర్యంలో శనివారం యువ అసిస్టెంట్ లోకో పైలెట్ల సదస్సుకు ఆర్‌వి రాము అధ్యక్షత వహించారు, సదస్సుకు ప్రధాన వక్తగా హాజరైన సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ కాన్ఫెడరేషన్ అద్యక్షులు వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌పిఎస్- యుపిఎస్ ఉద్యోగస్తులకు చాలా నష్టదాయకమన్నారు. యుపిఎస్ విధానంలో 1.1.2004నుంచి ఉద్యోగంలో ఉన్న ఉద్యోగస్తులకు రిటైర్మెంట్ పెన్షన్, వారి ఫ్యామిలీ పెన్షన్‌కు గ్యారెంటీ లేదన్నారు. పాత పెన్షన్ విధానంలో రిటైర్మెంట్ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్‌కి గ్యారెంటీ ఉందన్నారు. సుప్రీంకోర్టు పెన్షన్‌ని ఒక హక్కుగా పేర్కొందని, అయినా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ షరతులకు తలొగ్గి ప్రైవేటీకరణ విధానాల అమల్లో భాగంగా కార్పొరేట్ సంస్థలకు లాభాలు గుంజుకోవడానికే యుపిఎస్‌ను తీసుకొచ్చిందని నాగేశ్వరరావు అన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వివిఎల్ నరసింహులు మాట్లాడుతూ ఎఐఎల్ఆర్ఎస్ఎ చేస్తున్న ఉద్యమాలకు మద్దతు ఇస్తామన్నారు. ఈ సదస్సులో లోకో పైలెట్ల నాయకులు కె.రామకృష్ణ, ఎం వెంకటేషన్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

'అణు' కుంపటి వద్దు

- న్యూక్లియర్ పవర్‌ప్లాంట్‌కు ఎన్‌టిపిసి యోచన
- ఆలోచన విరమించుకోవాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ఆలోచన ఉందని ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ విశాఖలో ఈ నెల 13న నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించడంతో జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఉందని ఆయన చెప్పడంతో భయపడుతున్నారు. ఇప్పటికే తీరప్రాంతంలో ఔషధ, రసాయన పరిశ్రమల ప్రమాదాలు, కాలుష్యంతో బాధపడుతున్న ప్రజలకు న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఆలోచన శరాఘాతంగా మారనుంది. దాదాపు రెండువేల ఎకరాల విస్తీర్ణంలో 2,800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఎన్‌టిపిసి ఉన్నట్లు సమాచారం. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ వద్ద న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ తలపెట్టిన న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతుండగా అనకాపల్లి తీరంలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్‌టిపిసి సిద్ధపడుతోంది.

థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ప్రమాద రహిత విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని పర్యావరణ వేత్తలు ఒకవైపు చెబుతుండగా దానికి భిన్నంగా మరింత ప్రమాదకరమైన, ఖరీదైన న్యూక్లియర్ పవర్ ఉత్పత్తి వైపు ఎన్‌టిపిటిసి అడుగులు వేస్తోంది. జిల్లాలోని అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద 2014లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) 1200 ఎకరాలను ఎన్‌టిపిసికి కేటాయించింది. నాలుగు వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎన్‌టిపిసి తొలుత భావించింది. బొగ్గు సమస్యతో పాటు పర్యావరణ సమస్యలు తీవ్రమవుతున్నాయని థర్మల్ పవర్ ప్లాంట్ బదులు పర్యావరణ సమస్యల్లేని గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు చేయాలని 2022లో నిర్ణయించింది.

హైడ్రోజన్ ఉత్పత్తి చేయడానికి సముద్ర నీటిని ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించింది. ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దేశంలో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా తొలుత ఏర్పాటు చేయబోయే ఈ హబ్‌లో రూ.1.85 లక్షల కోట్ల వ్యయంతో రోజుకు 20 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యంతో 1500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. హరిత యూరియా, వైమానిక ఇంధనం, హరిత మిథనాల్ రోజుకు 7,500 టన్నుల ఉత్పత్తులను ఎగుమతి చేసే లక్ష్యంతో ప్రాజెక్టును రూపకల్పన చేశారు. అయితే ఈ గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు పట్టాలెక్కకముందే న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ను ఎన్‌టిపిసి తెరమీదకు తేవడంతో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు కేటాయించిన భూమిని న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు మళ్లిస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజల ప్రాణాలకే ముప్పు : సిపిఎం

అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ఆలోచనను ఎన్‌టిపిసి తక్షణమే విరమించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన అణు విద్యుత్ ప్లాంట్‌తో ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రమాద రహిత గ్రీన్ ఎనర్జీకి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నట్లు చెబుతూనే మరోవైపు అత్యంత ప్రమాదకరమైన అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధపడటం సరికాదని పేర్కొన్నారు. అమెరికాలోని త్రిమెన్ ఐలాండ్, రష్యాలోని చెర్నోబిల్, జపాన్‌లోని ఫుకుషిమాలో జరిగిన అణు ప్రమాదాల తరువాత ఆ దేశాల్లో అణు విద్యుత్ కేంద్రాలు మూసేస్తుండగా, ఇక్కడ ప్రమాదకరమైన అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలనుకోవడం తగదని తెలిపారు. అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజా పోరాటాలతో అడ్డుకుంటామని హెచ్చరించారు.

సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు, యూనివర్సిటీ వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యోజిత సహో (26) స్థానిక సెంట్రల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. యూనివర్సిటీ సమీపంలో ఓ గదికి అద్దెకు తీసుకున్నారు. తాను అద్దెకు ఉన్న గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయాన్ని మృతురాలి బంధువులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



యోజిత సహో (ఫైల్‌ఫొటో)

నీట మునిగి ఇద్దరు బాలికలు మృతి

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలో పెన్నానది పరివాహక ప్రాంతంలోని నీటిగుంతలో పడి ఇద్దరు బాలికలు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... సంచార జాతులకు చెందిన ఓ కుటుంబం కల్లూరులో నివసిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఆవులకు మేత కోసం సమీపంలోకి గుట్ట వద్దకు అరుణి (9), లక్ష్మి (13) తోలుకెళ్లారు. నీరు తాగడానికి సమీపంలో ఉన్న పెన్నానది పరివాహక ప్రాంతమైన నీటి గుంత వద్దకు ఆవులు వెళ్లాయి. నీటి గుంతలోకి ఆవులు దిగుతుండగా వాటిని నివారించే ప్రయత్నంలో అరుణి, లక్ష్మి నీటిగుంతలోకి దిగారు. అయితే గుంత లోతు ఎక్కువగా ఉండడంతో వారిద్దరూ నీట మునిగిపోయారు. గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వారి వచ్చి రక్షించేలోపు చిన్నారులిద్దరూ ఊపిరాడక మరణించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి పశ్చిమగోదావరి జిల్లా మేనేజర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - కాళ్ల (పశ్చిమగోదావరి జిల్లా)

ప్రజాశక్తి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మేనేజర్ పెన్మెత్స నారాయణరాజుకు మాతృవియోగం కలిగింది. నారాయణరాజు తల్లి సరస్వతి (84) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జువ్వలపాలెంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు వి.శ్రీదేవి, ఎన్.వరలక్ష్మి, ఒక కుమారుడు నారాయరాజు ఉన్నారు. నారాయణరాజు ప్రజాశక్తి జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సరస్వతి మృతి పట్ల ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్ తిరుపాల్ రెడ్డి, రాజమండ్రి యూనిట్ మేనేజర్ డి.శ్రీనివాస్, సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



పెన్మెత్స సరస్వతి (ఫైల్ ఫోటో)

ముగిసిన అంత్యక్రియలు

సరస్వతి భౌతికకాయానికి జువ్వలపాలెంలో శనివారం సాయంత్రం అంత్య క్రియలు నిర్వహించారు. ఆమె భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా నాయకులు కె.రాజా రామ్మోహన్‌రాయ్, ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి వేంద్ర శివప్రసాద్, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సీతారాం, ఎంఎం.సాంబమూర్తి, సిబ్బంది కె.బాలాజీ, జి.సాయికుమార్, టి.పెద్దిరాజు, పలువురు విలేకరులు సందర్శించి నివాళులర్పించారు.

గుంటూరు మేయర్ రాజీనామా

- రెడ్‌బుక్ వేధింపులు తాళలేక తప్పుకుంటున్నట్టు వెల్లడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి మనోహర్ నాయుడు (వైసిపి) తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. టిడిపి కూటమి సర్కారు తనను ఎంతో అవమానించిందని కన్నీటి పర్యంతమయ్యారు. రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తున్నట్టు తెలిపారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నిరసిస్తూ తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న టిడిపి కూటమి నాయకులు గత నెలలో జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలుపు కోసం తమ పార్టీ కార్పొరేటర్లను కొనుగోలు చేశారని ఆరోపించారు. ఈ నెల 17న స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు అధికారులు తనకు ఆలస్యంగా సమాచారం ఇచ్చారన్నారు. స్టాండింగ్ కమిటీలో ఏ ప్రతిపాదనలు ఉండాలో టిడిపి నాయకులు, కమిషనర్ కలిసి నిర్ణయించి ఏజెండా రూపొందించారని విమర్శించారు. నా ఛాంబర్‌కు తాళం వేసి, తన వద్ద పనిచేసే ఉద్యోగులను వెనక్కి పిలిచారని, తాను ఛాంబర్‌కు వెళితే అధికారులు డ్రామాలు చేస్తున్నారన్నారు. తాను మేయర్ పదవికి రాజీనామా చేసినా వైసిపిలో కొనసాగుతానని తెలిపారు. కమిషనర్, టిడిపి కూటమి నాయకుల ప్రవర్తనపై మనస్తాపంతోనే రాజీనామా చేసినట్టు ప్రకటించారు. పివికే నాయుడు కూరగాయల మార్కెట్ పేరు మార్చాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కుట్ర చేస్తున్నారని, వ్యాపారుల షాపుల కేటాయింపు విషయంలో ఏదైనా అన్యాయం జరిగితే వారి పక్షాన రోడ్డు ఎక్కుతానని తెలిపారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

- ఎస్ఎఫ్ఐ నిరసన దీక్షలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని విజయవాడలోని ధర్నా చౌక్‌లో శనివారం నిరసన దీక్ష జరిగింది. ఈ కార్యక్రమాన్ని లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం చేకూర్చేలా గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ప్రైవేట్ కళాశాలలకు సుమారు రూ.4 వేలకోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఈ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడం లేదన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 77ను రద్దు చేసి ప్రైవేట్ పిజి కళాశాలల్లో కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఐదు వేల బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని వ్యాపారమయం చేసే విధంగా ప్రయత్నిస్తోందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు పిపిపి విధానాన్ని తీసుకొస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన విధానాలనే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ పేద, అణచివేతకు గురైన విద్యార్థులకు అన్యాయం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యలో అనేక సంస్కరణలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోందని, దీనివల్ల సుమారు 10 వేల ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని అన్నారు. ఈ అంశాలను శాసనమండలిలో పిడిఎఫ్‌గా తాము ప్రస్తావిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పిపిపి, విద్యా సంస్కరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో లేవనెత్తిన సమస్యలను అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కరించడం లేదని విమర్శించారు. విద్యారంగాన్ని నారాయణ విద్యా సంస్థలకు అప్పగించేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు వై కేశవరావు, ఎపి కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రసన్నకుమార్, అశోక్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, జిఓ 77 రద్దుపై చలో విజయవాడకు పిలుపునిచ్చిన సందర్భంగా తమను ప్రభుత్వం చర్చలకు పిలిచి పరిష్కరిస్తామని చెప్పిందన్నారు. హామీ ఇచ్చి మూడు నెలలు దాటినా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఈ దీక్షకు పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజేష్, ఎఐఎస్ఎ రాష్ట్ర నాయకులు మహేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్, ఎం కిరణ్, సిహెచ్ వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి రవి, వెంకటేష్, సభ్యులు అమూల్య, సవిత, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నిరసన దీక్షకు హాజరైన విద్యార్థులు, నిరుద్యోగులు, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెయస్ లక్షణరావు (ఇన్‌సెట్‌లో)

పుంగనూరులో భగ్గుమన్న విభేదాలు

- టిడిపి కార్యకర్తలైన తండ్రీకొడుకులపై వేటకొడవళ్లతో దాడి
- ఆస్పత్రికి తరలిస్తుండగా తండ్రి మృతి

ప్రజాశక్తి - పుంగనూరు (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో రాజకీయ విభేదాలు భగ్గుమన్నాయి. టిడిపి కార్యకర్తలైన తండ్రీకొడుకులపై వైసిపి కార్యకర్త వేటకొడవళ్లతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తండ్రి మరణించగా, కుమారుడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ, ఆయన కుమారుడు సురేష్ టిడిపిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వెంకటరమణ వైసిపిలో కొనసాగుతున్నారు. ఎన్నికల్లో టిడిపి గెలుపు సందర్భంగా గ్రామంలో వేడుకలు నిర్వహించారు.

కేక్ కట్ చేస్తున్న సందర్భంలో ద్విచక్ర వాహనంపై వెంకటరమణ వచ్చి టిడిపి కార్యకర్తలపైకి వాహనాన్ని ఎక్కించాడు. ఈ ఘటనలో రామకృష్ణ భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వారాల క్రితం రామకృష్ణ పెద్ద కుమారుడు శివపై వెంకటరమణ దాడి చేశారు. ఈ క్రమంలో శనివారం రామకృష్ణ కుమారుడు సురేష్‌పై వేటకొడవలితో వెంకటరమణ దాడి చేశారు. పొలంలో పనులు చూసుకుని ఇంటికి వస్తున్న రామకృష్ణకు ఈ విషయం తెలిసింది. నా కుమారుడిపైనే దాడి చేస్తావా? అంటూ వెంకటరమణతో రామకృష్ణ ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో అదే వేటకొడవలితో రామకృష్ణ మెడ, కాళ్లపైనా నరికేశాడు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణకు ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మరణించారు. సురేష్ చేతికి తీవ్రగాయాలవ్వడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సోషల్ మీడియాలో వీడియో వైరల్

తమ కుటుంబానికి వైసిపికి చెందిన కె.వెంకటరమణ, గణపతి, మహేష్, త్రిలోక్‌లతో ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నా వారిలో స్పందన లేదని రెండు వారాల క్రితం సోషల్ మీడియాతో రామకృష్ణ విడుదల చేసిన ఓ వీడియో ప్రస్తుతం హల్‌చల్ చేస్తోంది. పుంగనూరు సిఐ శ్రీనివాసులు వైసిపి వాళ్లకు కొమ్ముగాస్తున్నారని వీడియోలో ఆయన ఆరోపించారు. వీడియో వైరల్ అయిన రెండు వారాల్లోనే రామకృష్ణ హత్యకు గురికావడం చర్చనీయాంశమైంది.

ప్రజలపై భారాలు వేసే ఒప్పందాలకు వ్యతిరేకంగా

విద్యుత్ కార్యాలయాల ముందు 28న ధర్నా


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న భారాలు, ప్రజావ్యతిరేకమైన ఒప్పందాలకు వ్యతిరేకంగా ఈ నెల 28న విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలోని ఎంబివికెలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాంతో కలిసి 'జగన్ సర్కారు పోయి బాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ షాకులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఒకవైపు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెబుతూనే 2025 జనవరిలో యూనిట్‌పై రూ.0.40పైసలు భారం వేశారని అన్నారు. దళితులకూ వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, 63 యూనిట్ల విద్యుత్ వాడితే రూ.548, 67 యూనిట్ల విద్యుత్ వాడితే రూ.867, 120 యూనిట్లు వాడితే రూ.3672 బిల్లులు వేశారని పేర్కొన్నారు. ఇవన్నీ ఉచిత విద్యుత్ అమలు చేయాల్సిన దళితుల ఇళ్లకు వచ్చిన బిల్లులేనని తెలిపారు. ఎన్నికల ముందు విద్యుత్ భారాలు పెంచబోమని, ఒప్పందాలపై విచారణ చేస్తామని చెప్పారని, ప్రస్తుత ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సెకీ ఒప్పందంపై, టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్మార్ట్‌మీటర్లపై హైకోర్టులో కేసు వేశారని తెలిపారు. సెకీ ఒప్పందం ద్వారా రూ.3,750 కోట్లకుపైగా భారం పడుతుందనీ, అసలు సెకీ ఒప్పందమే తప్పుడుదని ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబునాయుడు చెప్పారని అన్నారు. వాస్తవంగా సెకీ కేంద్ర ప్రభుత్వ సంస్థని, ఇప్పుడు కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి ఎందుకు ఈ తప్పుడు ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం లేదని ప్రశ్నించారు. గుజరాత్ ప్రభుత్వానికి అదానీ కంపెనీ రూ.1.99 పైసలకు సరఫరా చేస్తూ, మనకు మాత్రం రూ.2.49 పైసలకు ఒప్పందం చేసుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం భారాలు వేయబోమంటుంటే, మరోవైపు భారీ ఎత్తున బిల్లులు వస్తున్నాయని, వీటి లాజిక్ ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కేవలం అదానీ కోసమే విద్యుత్ ఛార్జీల పెంపును సమర్థించుకుంటున్నారని అన్నారు.

మోడీకి కుడి ఎడమలుగా బాబు, జగన్

ఇక్కడ పరస్పరం విమర్శించుకుంటున్న జగన్, చంద్రబాబు కేంద్రంలో మోడీకి కుడి, ఎడమలుగా ఉన్నారని చెప్పారు. సెకీతో ఒప్పందం సమయంలో జగన్‌కు రూ.1750 కోట్ల ముడుపులు అందాయని అమెరికాలో నమోదైన కేసుపై లోకేష్ ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా అదానీతో చేసుకున్న ఒప్పందం తాలూకా వివరాలు బయటపెట్టడం లేదని విమర్శించారు. ఒప్పందం ప్రకారం అదానీ కంపెనీ 7,000 యూనిట్లు సరఫరా చేయాల్సి ఉన్నా, 2024 సెప్టెంబర్ నాటికి మూడువేల యూనిట్లు మాత్రమే సరఫరా చేశారని పేర్కొన్నారు. అయినా ఒప్పందాన్ని కొనసాగించడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలపై వేస్తున్న భారాలు, అక్రమ ఒప్పందాలు, అన్యాయపు వసూళ్లకు వ్యతిరేకంగా ఈనెల 28న అన్ని విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నాలు చేపడతామని, భారాలపై వినతిపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. అలాగే 'మా ఇంటికి స్మార్ట్‌మీటర్లు వద్దు' 'ట్రూఅప్ భారాలు వద్దు' అని క్యాంపెయిన్ నిర్వహిస్తామని వివరించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
'విద్యుత్ షాకులు' పుస్తకావిష్కరణ
జగన్ అవినీతికి చంద్రబాబు వత్తాసు



'విద్యుత్ షాకులు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, వై వెంకటేశ్వర్లు, జె జయరాం

ప్రతి గ్రామంలోనూ సమస్యలు

ఈనెల 8వ తేదీ నుండి ప్రజాచైతన్యయాత్రలు నిర్వహిస్తున్నామని, వీటిల్లో ప్రజలెదుర్కొంటున్న సమస్యలు పెద్దఎత్తున వివరిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగేందుకు మంచినీరు లేదని, జల్‌జీవన్ మిషన్ పథకం కింద పైపులైన్లు వేసినా నీళ్లు రావడం లేదని తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో పలు గ్రామాల్లో నీరు తాగలేని పరిస్థితి ఉందని అన్నారు. ప్రజలు అత్యంత దయనీయస్థితిలో వాటిని తాగుతున్నారని తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజల బాధలు తెలుసుకోవాలని, వారు తాగుతున్న నీరు తాగి చూడాలని తెలిపారు. ఎక్కువ గ్రామాల్లో మురుగునీరు పోయే పరిస్థితి లేదని అన్నారు. రిలయన్స్ కంపెనీ పొలాలు, చెరువులకు వెళ్లే నీటిని కూడా తోడేస్తోందని, స్థానికులకు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. వేట నిషేధ కాలంలో మత్స్యకారులు ప్రభుత్వం ఇవ్వాల్సిన భృతి ఇవ్వలేదని, లాయర్లు, మహిళలు, విద్యార్థులు, రైతులకు అన్నదాత సుఖీభవ వంటి ఐదు రకాల సంక్షేమ పథకాల అమలు లేదని తెలిపారు. ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన అంశాలపై సచివాలయాలు, మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

దిక్కున్నచోట చెప్పుకోండని హోంమంత్రి అనడం సమంజసమా...

తమ భూములు బలవంతంగా లాక్కుంటున్నారని పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రజలు హోమ్‌శాఖ మంత్రికి చెబితే 'లాక్కుంటాం దిక్కున్నచోట చెప్పుకోండి' అని బెదిరించారని తెలిపారు. అలాగే నక్కపల్లి, పరవాడ పారిశ్రామిక ప్రాంతం మధ్యలో ఉన్న దాడి గ్రామంలో అక్కడి ఎమ్మెల్యే తాను ఎన్నికైన 15 రోజుల్లో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారని, దేవుడిపై ప్రమాణం చేశాడని తొమ్మిది నెలలు గడిచినా ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ గ్రామం పారిశ్రామిక ప్రాంతం మధ్యలో ఉందని, అయినా అక్కడి ప్రజలు నరకం అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశ్రమలు వస్తాయని చెబుతున్నారని, అవి వచ్చి ఎవరిని ఉద్ధరిస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలవరం పరిహారం తేల్చాలి

పోలవరంలో నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారంలో పెంపుదల లేకపోగా లబ్ధిదారుల సంఖ్యలో కోత పెడుతున్నారని, ఇప్పటికి మూడువేలమందిని తగ్గించారని అన్నారు. 2016లో నిర్ణయించిన పరిహారాన్ని పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచడం లేదని, ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని రెండుసార్లు పెంచారని పేర్కొన్నారు. కాలం గడుస్తున్న కొద్దీ అదనపు కుటుంబాలను చేర్చాల్సింది పోయి తగ్గిస్తున్నారని, ముంపు గ్రామంలో రోడ్డుకు ఒకవైపున ముంపుగా గుర్తించి రెండోవైపున గుర్తించలేదని అన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిశీలించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో 'పునరావాసం తరువాతే పోలవరం' అనే నినాదంతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజనులకు వ్యతిరేకంగా గిరిజనేతరులను రెచ్చగొడుతోందని తెలిపారు. ఇప్పటికీ ట్రైబల్ ఎడ్వయిజరీ కమిటీ సమావేశం జరగలేదని తెలిపారు. నిర్వాసితులను మోసంచేసే వైఖరి మానుకుని, ఏప్రిల్, మే నెలల్లో పునరావాస సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు.

భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు వారసులు కమ్యూనిస్టులే

హిందీ భాషను బలవంతంగా రుద్దుతామన్న పవన్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రిగానీ, లోకేష్‌గానీ ఇంతవరకు స్పందించలేదని శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్‌టిఆర్ ఆశయాలకు విరుద్ధమైన ఈ ప్రకటనపై ఇప్పటి వరకూ నోరెత్తకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 2019లో పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలు, ఇప్పటి మాటలు ఒకసారి వింటే పరస్పర విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. అప్పుడు బిజెపి మోసం చేస్తుందన్న పవన్ ఇప్పుడు అదే బిజెపి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. భారతీయ భాషలను నాశనం చేసి హిందీ అమలుకు కేంద్రంలో బిజెపి ప్రయత్నిస్తోందని, రాష్ట్రాల హక్కులను హరించే విధంగా హిందీని అమలు చేస్తామనే హక్కు కేంద్రానికి ఎక్కడుందని ప్రశ్నించారు. టిడిపి గనుక పవన్ వ్యాఖ్యలను సమర్థిస్తే ఎన్‌టిఆర్ ఆత్మ క్షోభిస్తుందని తెలిపారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడేది కమ్యూనిస్టులేనని, పదేపదే సనాతన ధర్మం గురించి చెప్పే పవన్‌కల్యాణ్ చరిత్రలో రామానుజాచార్యులు, పోతులూరి వీరబ్రహ్మం, వేమన, కబీర్ వంటి వారు చెప్పిన వాటినికూడా అమలు చేయాలని, కేవలం మనుధర్మాన్ని అమలు చేస్తే దేశానికి హానికరమని అన్నారు. బలవంతంగా హిందీని రుద్దుతామనే చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.



స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

విద్యార్థుల అభ్యున్నతికి చదువే మార్గం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- స్మార్ట్ క్లాస్ రూమ్ కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి-గంట్యాడ (విజయనగరం జిల్లా)

ఏ వ్యక్తి అభ్యున్నతికైనా చదువే మార్గమని చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం మదనాపురంలోని మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాల నుంచి స్మార్ట్ క్లాస్ రూమ్ కార్యక్రమానికి ఆయన శనివారం శ్రీకారం చుట్టారు. ఎన్‌ఐటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండస్ టవర్స్ లిమిటెడ్ రూపొందించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 పాఠశాలల్లో వర్చువల్‌గా ప్రారంభించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నాంది ఫౌండేషన్ సమకూర్చిన స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ క్లాస్ రూమ్ విధానం ద్వారా డిజిటల్ అక్షరాస్యత, మాస్ కమ్యూనికేషన్, సైబర్ సర్వీసులు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఈ పది పాఠశాలలు శిక్షణ కేంద్రాలుగా రూపొందుతాయన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాన్ని సాధించాలని, దేశానికి ఒక ఆస్తిగా మారాలని ఆకాక్షించారు. ఇండస్ టవర్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కిల్ సిఇఒ దిలీప్ కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ క్లాస్ రూమ్ కార్యక్రమం ద్వారా డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి, భవిష్యత్ తరాలకు సాధికారత కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.



పరిసరాలు శుభ్రం చేస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

స్వచ్ఛ సుందరపల్లి రాష్ట్రానికే ఆదర్శం

- స్వయంగా పరిసరాలను శుభ్రం చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-చల్లపల్లి (కృష్ణా జిల్లా)

పరిశుభ్రతలో స్వచ్ఛ సుందరపల్లి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, దీన్ని జిల్లాలోని ప్రతి పంచాయతీ స్ఫూర్తిగా తీసుకొని స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ కోరారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చల్లపల్లి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. తడి, పొడి చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా 'స్వచ్ఛ సుందరపల్లి' కార్యక్రమం ద్వారా వందల మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా ప్రతిరోజూ ఉదయం కొంత సమయాన్ని కేటాయించి చల్లపల్లి పట్టణాన్ని నిత్యం శుభ్రం చేసుకుంటూ రాష్ట్రంలో అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అదేవిధంగా ఈ పంచాయతీలో తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే పద్ధతి సక్రమంగా జరుగుతోందని అభినందించారు. ఇది జిల్లాలోని అన్ని పంచాయతీలకు స్ఫూర్తిదాయకమని, దీన్ని అందరూ ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి పి మాధవేంద్రరావు, ఎంపిడిఒ ఎవి రమణ, స్వచ్ఛ సుందరపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్షణమే డిఎస్‌సి నోటిఫికేషన్

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డిఎస్‌సి నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో డిఎస్‌సి అభ్యర్థుల పరిస్థితి దయనీయంగా ఉందని పేర్కొన్నారు. ఏడేళ్లుగా ఒక్క నోటిఫికేషన్ లేకపోవడంతో ఒకవైపు కుటుంబం నుంచి ఒత్తిడి, మరోవైపు అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం 10 నెలలుగా డిఎస్‌సి ఇదిగో అంటూ నిరుద్యోగులను ఊరిస్తూ మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ హామీలు నమ్మి నోటిఫికేషన్లు వస్తాయని ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుని విలువైన సమయాన్ని, డబ్బులను పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులు రోడ్లపైకి రాకముందే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 117ను రద్దు చేయాలని, గతంలో మూసివేసిన పాఠశాలలను పున:ప్రారంభించాలని కోరారు. పేదల విద్యకు హామీగా ఉన్న ప్రభుత్వ విద్యను కాపాడాలని కోరారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఖాళీలతో సహా విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.

శాసన సభ్యుల క్రీడా పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

- శాప్ ఛైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్న క్రీడా పోటీలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, డాక్టర్ దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియాల్లో జరిగే క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లను శాప్, విఎంసి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్, త్రోబాల్, టెన్నిస్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్ 100 మీటర్ల కోర్టులను పరిశీలించారు. విఎంసి అధికారులు, శాప్ అధికారులకు ఈ సందర్భంగా పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల నిర్వహణపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, క్రీడల శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్ పార్కింగ్, తాగునీరు, లైటింగ్, టాయిలెట్స్, వేదికలు, గ్యాలరీల ఏర్పాటు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ ఎఒ ఆర్ వెంకటరమణ నాయక్, శాప్ అధికారులు, విఎంసి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బిజెపిలో జనసేన విలీనం చేయడం మంచిది

- పిసిసి ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీని రద్దు చేసుకుని బిజెపిలో విలీనం చేయడం మంచిదని పిసిసి ముఖ్య అధికార ప్రతినిధి నర్రా తులసిరెడ్డి సూచించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతూనే ఉందని, ఈ ముగ్గురూ బిజెపి చేతిలో కీలు బొమ్మలని విమర్శించారు. తనకు పదవి పిచ్చి లేదని, సైద్ధాంతిక బలం ఉందని పవన్‌కల్యాణ్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. పదవి పిచ్చి లేకపోతే డిప్యూటీ సిఎం పదవి ఎందుకు? నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఎందుకని ప్రశ్నించారు. పవన్ సిద్ధాంతం చేగువేరా సిద్ధాంతమా? లేక సనాతన ధర్మ సిద్ధాంతమా? లేక ఊసరవెల్లి సిద్ధాంతమా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు గురునాథం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

ఫ్రీకాట్ మిల్లును పున: ప్రారంభించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్

ప్రజాశక్తి - పరిగి

శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలంలోని కొడిగనహళ్లి వద్ద ఉన్న ఫ్రీకాట్ మిల్లు మూసివేత నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం మండలంలోని ఫ్రీ కాట్ మిల్లు బి యూనిట్‌ను పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లా కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు ఇచ్చి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు హిందూపురం ప్రాంతంలో ఫ్రీకాట్ మిల్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. 42 సంవత్సరాలుగా ఎన్నో కుటుంబాలకు జీవనోపాధి కల్పించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన పరిశ్రమను నేడు మూసివేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని తెలిపారు. అందులో భాగంగా కార్మికులపై పలు రకాలుగా ఒత్తిడి తీసుకొస్తోందన్నారు. ఇప్పటివరకు కార్మికులు అనేక రూపాల్లో ఉద్యమాలు నిర్వహించారని, అయినప్పటికీ పరిశ్రమను పున: ప్రారంభించడానికి ముందుకు రాకపోవడం బాధాకరమని తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను కాపాడుకోలేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. మిల్లు మూసివేతకు ప్రభుత్వ నిర్ణయాలే కారణమని యాజమాన్యం చెబుతోందని, ఇందుకు తగిన విధంగా ప్రభుత్వమే బాధ్యత వహించి మిల్లు పునర్ ప్రారంభానికి యాజమాన్యంతో చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ తీసుకొని కార్మికుల పక్షాన యాజమాన్యంతో మాట్లాడి మిల్లు కొనసాగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఇఎస్ వెంకటేష్, ఫ్రీ కాట్ మిల్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు, చిలమత్తూరు సిఐటియు నాయకులు ఫిరంగి ప్రవీణ్ తదితర నాయకులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.



ఫ్రీకాట్ మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భాస్కరయ్య

ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య
- ఆహ్వాన సంఘం కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని క్రాంతి హైస్కూల్‌లో ఎపి రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం కరపత్రాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారులు, కార్మికులు, ఉద్యోగులు, యువకులు, మహిళల ఎదుర్కొంటున్న సమస్యలను ఈ మహాసభలో చర్చించి రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను రూపొందించేందుకు డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ బి కాలనీ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏప్రిల్ 20, 21 తేదీల్లో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రజకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు బోలియ శెట్టి శ్రీకాంత్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు చిక్కవరపు వెంకట రెడ్డయ్య, ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లూరు శ్రీనివాసరావు, బండారు వెంకట శివరామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

- న్యాయం కోసం ఆరేళ్లుగా పోరాడుతున్నా : సునీత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య జరిగి ఆరు సంవత్సరాలు అయ్యిందని, న్యాయం కోసం పోరాడుతున్నానని ఆయన కుమార్తె వైఎస్.సునీతా అన్నారు. సాక్షులు అనుమానాస్పద స్థితితో మృతి చెందుతున్నారని, సాక్షులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాన్నిదేనని తెలిపారు. వివేకా 6వ వర్ధంతి సందర్భంగా శనివారం పులివెందులలోని వివేకా సమాధి వద్ద కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, వివేకా బావమరిది శివ ప్రకాశ్‌రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు పూలమాలవేసి నివాళులు అర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. హత్య కేసులో నిందితులంతా యథేచ్ఛగా బయట తిరుగుతున్నారని, విచారణ జరగడం లేదని ఆరోపించారు. ట్రైల్స్ నడవట్లేదని, న్యాయం జరుగుతుందా? లేదా? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఎంతగా పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిబిఐ మళ్లీ విచారణ చేపడుతుందనే నమ్మకం మాకు ఉందన్నారు. ఈ కేసులో నిందితుల కంటే తమకు, తమ కుటుంబానికే ఎక్కువ శిక్ష పడుతున్నట్టు అనిపిస్తోందనిపేర్కొన్నారు. న్యాయం జరిగేంత వరకూ పోరాడుతూనే ఉంటానని తెలిపారు.

తొక్కిసలాటపై కమిషన్ విచారణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి బైరాగిపట్టెడలో జరిగిన తొక్కిసలాట ఘటనపై వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి ఉద్యానవనంలో యాత్రికులను కమిటీ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి శుక్రవారం విచారించారు. యాత్రికులను ఏ విధంగా క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన 16 మందిని వర్చువల్ విధానంలో విచారించారు. ఈ నెల 17న ఇదే ఘటనపై టిటిడి ఇఒ శ్యామలరావును, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజులను విజయవాడలో జరిగే విచారణకు హాజరు కావాలని ఇప్పటికే నోటీసులను అందజేసిన విషయం తెలిసిందే.

సంపాదకీయం

లాజిక్ మిస్సయ్యారు!

నిరంకుశత్వంలోంచి, విద్వేష రాజకీయాల్లోంచి ఏ కళలు, ఏ సృజనా మొలకెత్తవు. కళలు, సంస్కృతి, సాహిత్యం వంటివి మానవత్వానికి ప్రతీకలు. ఈ మానవత్వాన్ని దెబ్బతీసేది, వేరుపురుగులా తొలిచేది... విద్వేష రాజకీయం. సృజనాత్మకత, కళాతృష్ణ మానవత్వ భావాల్లోనుంచి మాత్రమే వెల్లివిరుస్తాయి. .'నూరు పూవ్వులు వికసించనీ... వేయి భావాలు సంఘర్షించనీ' అంటారు మావో. సృజన అనేది బహుముఖం. కళ సృజనాత్మకమైనది... రాగద్వేషాలకు అతీతమైనది. శాస్త్ర పరిశోధనలు సైతం సృజనాత్మకత నుంచి, భావ స్వేచ్ఛ నుంచి పుట్టుకొస్తాయే తప్ప విద్వేషం నుంచి కాదన్నది జగమెరిగిన సత్యం. . ప్రపంచంలో ఏ భాషవారైనా, ఏ ప్రాంతం వారైనా ప్రేమాభిమానాలు చవిచూసేది మొట్టమొదట తల్లి నుంచే. మొదటి మాట నేర్చుకునేదీ తల్లిభాష నుంచే. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా/ పొగడరా నీ తల్లి భూమి భారతిని/ నిలుపరా నీ జాతి నిండు గౌరవము' అంటారు రాయప్రోలు. 'జల్దుకొని కళలెల్ల నేర్చుకు, దేశి సరుకులు నింపవోయ్' అన్న గురజాడ ప్రబోధంలో కూడా మనకి ఏ హద్దులూ విధించలేదు. ఎవరి మాతృభాష వారు మాట్లాడాలి, ఎవరికి నచ్చిన భాష వారు నేర్చుకోవాలి. ఈ నేర్చుకోవడంలో, మాట్లాడటంలో వుండాల్సింది... స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం.


1950ల నాటి ఫ్రెంచ్ సామ్రాజ్య పాలనకు వ్యతిరేకంగా జరిగిన అల్జీరియన్ తిరుగుబాటు యొక్క అసాధారణ పునఃసృష్టి 'ద బ్యాటిల్ ఆఫ్ అల్జీర్స్'. 1966లో వచ్చిన అల్జీర్స్ యుద్ధం అనే ఈ క్లాసిక్ చిత్రంలో ముస్లింల అణచివేత, తిరుగుబాటు వంటి అత్యంత ఉత్తేజభరితమైన సన్నివేశాలు అనేకం వుంటాయి. ఇలాంటి క్లాసిక్ చిత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఆస్వాదించగలుగుతున్నాం కదా? రాక్ మ్యూజిక్ నుంచి హిందూస్తానీ, జానపద సంగీతం వరకూ అన్నిరకాల సంగీతాలకూ మైమరచిపోతుంటాం. మలయాళం, తమిళం, బెంగాలీ, మరాఠీ వంటి ప్రాంతీయ భాషల్లో గొప్పగొప్ప క్లాసిక్ మూవీస్ వున్నాయి. వాటన్నింటినీ ఆస్వాదిస్తున్నాం కదా?

కళాకారుడిగా వచ్చిన గుర్తింపుతో రాజకీయాల్లోకి వచ్చిన ఎపి డిప్యూటీ ముఖ్యమంత్రి... భాషకీ భాషకీ మధ్య పోటీ పెట్టే రాజకీయాలు మాట్లాడటం శోచనీయం. ఈ తరహా రాజకీయం మొదలు పెట్టిందే... కేంద్ర బిజెపి ప్రభుత్వం. దేశం మొత్తానికి ఒకే విద్యావిధానం వుండాలని హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేసింది. కాదంటే కేంద్రం నుండి రాష్ట్రానికి ఇవ్వవలసిన నిధులను ఇచ్చేది లేదని బెదిరిస్తోంది. ఇది ఆయా భాషలకు చెందిన ప్రజల స్వేచ్ఛను, రాజ్యాంగబద్ధమైన హక్కును కాలరాయడమే. దాదాపు నాలుగు కోట్ల జనాభా వున్న ఫ్రెంచ్ వారు, మూడు కోట్ల వరకూ వున్న జపనీస్... తమ తమ సొంతభాషలనే అన్ని వ్యవహారాలకూ వాడతారు. పలు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలూ అంతే. సాహిత్యం, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు... అన్నీ వారి వారి మాతృభాషలోనే రూపొందించుకున్నారు. ఇది వారి అస్తిత్వానికి సంకేతం. ఏ భాషనీ ఎవరిపైనా బలవంతంగా రుద్దకూడదు. ఇప్పుడు తమిళులు చేస్తున్న పోరాటం ఇదే. తమ అస్తిత్వం కోసం, తమ మాతృభాష కోసం పోరాటం చేస్తుంటే, రెండు భాషల మధ్య తగువుగా దీన్ని చిత్రించే ప్రయత్నం జరుగుతోంది.

.

కాబట్టి తమిళులనో, తమిళ సినిమాలనో తప్పుబట్టడంలో విజ్ఞతలేదు. నిజానికి వారితో గొంతు కలిపి మన మాతృభాషను కాపాడుకునే ప్రయత్నం మనం చేయకుండా... ఆ పని చేస్తున్నవారిపై బిజెపి భావజాలాన్ని మీ గొంతు నుంచి వెదజల్లడం ఎంతవరకూ భావ్యం? రాష్ట్రంలో బోధనా భాషగా వున్న తెలుగును ఎల్‌కెజీ నుంచే ఎత్తేసే ప్రయత్నానికి మద్దతిస్తున్న మీరు... వారి హక్కునెలా ప్రశ్నిస్తారు? 'మీ హిందీ భాషను మా మీద రుద్దకండీ' అని చెప్పడం... ఇంకో భాషను ద్వేషించడం కాదు. నా తల్లిని నేను గౌరవిస్తాను అంటే, ఎదుటివారి తల్లిని అవమానిస్తున్నట్లు కాదన్న చిన్న లాజిక్‌ను ఎందుకు మిస్సవుతున్నారు? తమిళులను తప్పుబట్టకుండా, మీరూ మీ తల్లిభాషను వారిలా ప్రేమించడం మొదలుపెడితే... ఎక్కడ గాడితప్పామో మనకర్థమౌతుంది. పదికోట్ల తెలుగువాళ్లు ఒక జాతిగా ముందడుగేయడానికి ప్రేరణ ఇవ్వగల మాతృభాషను విస్మరించి, ఆత్మగౌరవాన్ని, మరిచి, ఎవరెవరి సేవలోనో తరించిపోవడం సిగ్గుచేటు. అదిచాలదన్నట్లు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి నిలబడి పోరాడుతున్న సాటి రాష్ట్రం మీద విమర్శలకు దిగడం అంతకన్నా హేయం.


మహనీయుల మాట



ఎదుటివారు నీ మాటలను శంకించినా...
నీ పనిని చూసి నమ్ముతారు.
పనికి వున్న విలువ అది.

- గోర్కీ

ప్రసిద్ధ రష్యన్ రచయిత.



దక్షిణాది ఆందోళనలూ సనాతన సమర్థకులూ

ప్రస్తుతం

మార్చి 22న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చెన్నైలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం దేశవ్యాపితంగా చర్చకు దారితీస్తున్నది. ఏకపక్షంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయడం దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందనే ఆందోళనతో జరుగుతున్న ఈ సమావేశానికి హాజరవుతున్నట్టు కేరళ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు పినరయి విజయన్, రేవంత్ రెడ్డి, సిద్దరామయ్య ప్రకటించారు. ప్రతిపక్షంలో వున్న వైఎస్‌ఆర్ పార్టీ అధినేత జగన్‌నూ, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఒరిస్సా బిజెపి ముఖ్యమంత్రి చరణ్ మాఝీని, బెంగాల్ తృణమూల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కూడా పిలిచారని చెబుతున్నారు. ఇంకా ఆప్ వంటి పలు రాజకీయ పార్టీల అధినేతలను కూడా ఆహ్వానించారు. 'ఇండియా' వేదిక 2024 ఎన్నికలతో ముగిసిపోయిందని సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్ కరత్ చెప్పిన నేపథ్యంలో– రాజకీయ చర్చ కాకపోయినా రాజ్యాంగ అంశంపై జరిగే ఒక విస్తృతమైన రాజకీయ సమీకరణ వేదికగా ఈ సమావేశం దృష్టిని ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు. సరిగ్గా ఈ నేపథ్యంలోనే హిందీని బలవంతంగా రుద్దడం కూడా పునర్విభజన చర్చకు తోడై వేడి పెరిగింది.

ఎదురు దాడి దేనికి?

ఈ సమావేశం ఇంకా జరగక ముందే బిజెపి, దాని భాగస్వాములైన టిడిపి, జనసేన వంటివి ప్రత్యక్షంగా పరోక్షంగా దాడి చేస్తున్నాయి. బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు ఎంపి లక్ష్మణ్ దేశాన్ని విభజించే రాజకీయాల కోసం చెన్నైలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఈ దేశం ఏమైనా కేక్‌లా కోసుకు తినడానికా అంటూ ఎ.పి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం జయకేతనం సభలో చేసిన వ్యాఖ్య ఇందుకు పరాకాష్ట. ఇదేదో భాషల మధ్య, ఉత్తరాది దక్షిణాది మధ్య, మతాల మధ్య యుద్ధమన్నట్టు పవన్ వ్యాఖ్యలు సాగాయి. తెలుగువారి పట్ల తమిళులు వివక్ష చూపిస్తారని ఆరోపించడమే గాక షరామామూలుగా తన సనాతన మంత్రంతో లౌకికతత్వంపైన విశృంఖల వ్యాఖ్యలకు ఆయన పాల్పడ్డారు. అసలు వివాదానికి కారణమైన కేంద్ర బిజెపిని నెత్తినెత్తుకుని ఉత్తరాది, దక్షిణాది తేడాలేమిటని లౌకిక పార్టీలపై చిందులేశారు. మరోవైపున మంత్రి లోకేశ్ అనేక భాషలు నేర్చుకుంటే తప్పేమిటని హిందీ రుద్దే ప్రయత్నాలకు వంత పాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విషయానికి వస్తే నియోజకవర్గాలు తగ్గుతాయనేది కేవలం ఊహాగానంగా వుందంటూ దాటవేశారు (మళ్లీ ఆయనే 2029 నాటికి మహిళా రిజర్వేషన్ కింద ఎ.పి శాసనసభలో 70 స్థానాలు పెరుగుతాయని సభ సాక్షిగా ఊహించి చెప్పారు. లోక్‌సభలో పెరగకుండా శాసనసభలో మాత్రమే పెరిగే అవకాశముండదని వేరే చెప్పనవసరం లేదు.). దక్షిణాదికి ఒక్క సీటు కూడా తగ్గబోదని హోంమంత్రి అమిత్ షా ఇటీవల చెప్పడాన్ని ఇలాంటి వారు ప్రస్తావిస్తున్నారు. కానీ ఇక్కడ తగ్గకపోయినా అ క్కడ పెరిగితే కథ మళ్లీ మొదటికి వస్తుంది కదా అని దక్షిణాది నాయకులు వేసే ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. కనుక పునర్విభజన అయినా, హిందీ భాషను రుద్దడమైనా పూర్తి వివరాలు చెప్పకుండా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల ఉత్పన్నమైన పరిస్థితి ఇది. పవన్ వంటి వారు దక్షిణాది మోడీల్లా మారిపోయి ఎదురు దాడి చేసినంత మాత్రాన, చంద్రబాబు, లోకేశ్ దాటేసినంత మాత్రాన ఒక వాస్తవ సమస్య లేకుండా పోదు. బిజెపితో అనుకూలంగా వుండే జగన్ కూడా తమ ఎంపీల సమావేశంలో ఈ అంశంపై పూర్తి చర్చ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని చెప్పారని అంటున్నారు. చెన్నై సమావేశానికి ఆయన కాకపోయినా వైసిపి ఎంపీలు హాజరయ్యే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి గానీ నిజంగా ఏం జరుగుతుందో చూడాలి. ముందే చెప్పినట్టు ఈ విషయం వరకూ బిఆర్‌ఎస్ కూడా హాజరవుతానని ప్రకటించింది. కాకపోతే ఆ సమయంలో కూడా రేవంత్ సర్కారుకు సంస్కారం లేదనీ, స్టాలిన్‌కు సంస్కారం వుంది గనక పిలిచారని కెటిఆర్ వ్యాఖ్యానించారు. 2023 శాసనసభ ఎన్నికలకు కాస్త ముందు నుంచి బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ బిజెపిపై విమర్శలు తగ్గించి కాంగ్రెస్ పైనే కేంద్రీకరించడం తెలిసిన విషయమే. ఏతావాతా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక పరిస్థితి కూడా ఈ దక్షిణాది సమ్మేళనంలో ఎలా వ్యక్తమవుతుందనేది మరో అంశం.

పునర్విభజన రహస్యం?

ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నట్టు నియోజక వర్గాల తగ్గింపు అనేది ఊహాజనితమైన ప్రశ్న కాదు. పినరయి విజయన్ దీనిపై స్పష్టమైన ప్రకటనే చేశారు. గతంలో చాలా సార్లు చెప్పుకున్నట్టు జాతీయ విధానంలో భాగంగా జనాభా తగ్గింపు కృషిలో జయప్రదమైన దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గించడం కన్నా పొరబాటుండదు. అదే సమయంలో బీహార్, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు జనాభా విపరీతంగా పెరుగుతున్నా అదుపు చేయనందుకు సత్కరించినట్టు సీట్లు పెంచడమూ తప్పే అవుతుంది. చంద్రబాబు, స్టాలిన్ కూడా ఏ అధ్యయనం లేకుండా చెబుతున్నట్టు జనాభా పెంచేయమని పిలుపివ్వడమూ కాదు. కేంద్ర విధానం రాజ్యాంగబద్ధంగా శాస్త్రీయంగా వుండాలని పినరయి తన ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రతి రాష్ట్రానికీ ఇప్పుడున్న సీట్ల శాతం తగ్గకూడదు. జనాభా తగ్గించినందుకు సీట్ల తగ్గింపు శిక్ష కాకూడదు. 1952, 1963, 1973లో అంటే ప్రతి దశాబ్దికి ఒకసారి జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణతో దాన్ని నిలిపేసి 2001 తర్వాత మళ్లీ చేపట్టాలని నిర్ణయించారు. ఈలోగా జనాభా నియంత్రణను ప్రోత్సహించి వివిధ రాష్ట్రాల మధ్య జనాభా అసమానతలు తగ్గించాలనేది ఇక్కడ ఉద్దేశం. 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం దీన్ని 2031 వరకూ నిలిపేశారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ చర్చ ముందుకు తెచ్చిన కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు జనాభా నిష్పత్తి ప్రకారమే సీట్లు వుంటాయి గానీ తగ్గబోవని మాట్లాడుతున్నది. అయితే ఇక్కడ సమస్య ఏమిటో పినరయి సూటిగానే లేవనెత్తారు. సీట్ల నిష్పత్తిని కాపాడతారా లేక జనాభా నిష్పత్తిని కాపాడతారా? ఇందులో ఏది పాటించినా సీట్లు తగ్గుతాయని తేల్చిచెప్పారు. గతంలో 1952లో అప్పటి దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా లోక్‌సభలో 25.35 శాతం వుంటే 1967 నాటికి అది 24.13 శాతానికి తగ్గింది. 1977లో వున్నవాటిని స్తంభింపచేసేనాటికి ఈ వాటా 23.85 శాతానికి దిగజారింది. మామూలుగానే ఇంత తగ్గుదల కనిపిస్తుంటే ఇప్పుడు పెద్ద ఎత్తున జరిగిన జనాభా తగ్గింపు తర్వాత ఇది మరీ కోత పడటం అనివార్యం. కనుకనే పినరయి వంటి వారు ముందు మీ పునర్విభజన ప్రాతిపదిక ఏంటో చెప్పి సీట్ల విషయంలో న్యాయం జరిగేలా హామీ కల్పించి తర్వాతే అడుగు ముందుకేయాలంటున్నారు. ఇదేదో సీట్లు, పార్టీల సమస్యగా చూస్తే పొరబాటు. దేశవ్యాపిత విధానాలు రూపొందించే పార్లమెంటులో రాష్ట్రాలకు అందులోనూ పెద్ద భాగంగా వున్న మొత్తం దక్షిణాదికి తగు ప్రాతినిధ్యం లేకపోతే నష్టం కలుగుతుంది. దేశ సమైక్యతా భావనా దెబ్బ తింటుంది. శుష్క నినాదాలతో అధీకృత దేశభక్తి భంగిమలతో తేలేది కాదు. నిజమైన సమాఖ్య భావనతో రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామిక అవగాహనకు రావాల్సి వుంటుంది. ప్రతి జనాభా లెక్కల తర్వాత పార్లమెంటు నిర్ణయం మేరకు రాష్ట్రపతి ఆదేశాలతో నియోజక వర్గాల పునర్విభజన జరగాలని మాత్రమే రాజ్యాంగం చెబుతున్నది. ఇప్పుడు జనాభా తగ్గించిన రాష్ట్రాలకు నష్టం జరగకూడదంటే ఆ మేరకు నిర్దిష్టమైన కొత్త కొలబద్దలు కావాలి. వాటిపై రాష్ట్రాలతో వివరమైన చర్చ జరగాలి. అవేవీ లేకుండానే అమిత్ షా తో సహా కేంద్ర పెద్దలు ఏకపక్షంగా మాట్లాడటం సందేహాలు పెంచుతున్నది. కేంద్రం ఏకపక్ష నిర్ణయాల నేపథ్యం, దక్షిణాన బిజెపి బలం బాగా తక్కువ కావడం, ఈ సందేహాలను తీవ్రం చేస్తుంది. జనాభా ప్రాతిపదికను ఆధారం చేసుకుని వాదిస్తున్న బిజెపి 2021 నాటికి పూర్తికావలసిన జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేయడం కూడా సందేహాలను పెంచుతోంది.



> గతంలో 1952లో అప్పటి దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా లోక్‌సభలో 25.35 శాతం వుంటే 1967 నాటికి అది 24.13 శాతానికి తగ్గింది. 1977లో వున్నవాటిని స్తంభింపచేసేనాటికి ఈ వాటా 23.85 శాతానికి దిగజారింది. మామూలుగానే ఇంత తగ్గుదల కనిపిస్తుంటే ఇప్పుడు పెద్ద ఎత్తున జరిగిన జనాభా తగ్గింపు తర్వాత ఇది మరీ కోత పడటం అనివార్యం. కనుకనే పినరయి వంటి వారు ముందు మీ పునర్విభజన ప్రాతిపదిక ఏంటో చెప్పి సీట్ల విషయంలో న్యాయం జరిగేలా హామీ కల్పించి తర్వాతే అడుగు ముందుకేయాలంటున్నారు.

> పునర్విభజన అయినా, హిందీ భాషను రుద్దడమైనా పూర్తి వివరాలు చెప్పకుండా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల ఉత్పన్నమైన పరిస్థితి ఇది. పవన్ వంటి వారు దక్షిణాది మోడీల్లా మారిపోయి ఎదురు దాడి చేసినంత మాత్రాన, చంద్రబాబు, లోకేశ్ దాటేసినంత మాత్రాన ఒక వాస్తవ సమస్య లేకుండా పోదు.

హిందీ, హిందుత్వ!

కేంద్రం ఏకపక్షంగా తీసుకొచ్చిన నూతన విద్యా విధానం కూడా దక్షిణ, తూర్పు రాష్ట్రాలలో హిందీ బలవంతాన రుద్దుతున్నారనే నిరసనకు దారితీసింది. తూర్పు రాష్ట్రాలలోనూ ఈ భావన వుంది. కేంద్రం ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ పార్లమెంటు ప్రశ్నోత్తరాల్లోనూ కూడా హిందీనే పెంచడంపై ఎంపీలు నిరసన తెలియజేశారు. కేరళ సిపిఎం ఎంపి జాన్ బ్రిటాస్ దీనిపై సుదీర్ఘ లేఖ రాశారు. హిందీ భారతీయ ఆత్మ అని స్వయంగా అమిత్ షా ప్రకటించారు. తమిళనాడులో సంప్రదాయికంగా హిందీ సమస్యపై భావోద్వేగాలు ఎక్కువ గనక ఆ పేరే వినిపిస్తుంది గానీ సమస్య నిజమైందే. నూతన విద్యా విధానం త్రిభాషా సూత్రాన్ని మళ్లీ ముందుకు తెచ్చింది. ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలని చెప్పడం గాక స్థానిక భాష లేదా ప్రాంతీయ భాష ఏదో ఒకదాంట్లో జరగాలని, మరో భారతీయ భాష కూడా నేర్వాలనీ ఆ విధానం చెబుతున్నది. ఇది అశాస్త్రీయమే గాక ఆ లేత వయసుకు భారం కూడా. ఇప్పటికే ఇంగ్లీషు మీడియంతో చదువులు మొదలవుతున్న స్థితిలో ప్రాంతీయ భాష, భారతీయ భాష అనడం హిందీ లేదా సంస్కృతం తెచ్చిపెట్టడానికే దారితీస్తుందనేది అనుభవం. హిందీ రాష్ట్రాలలో ఆ భాష నేర్చుకుంటే సరిపోతుంది గాని ఇతర చోట్ల మరో భారతీయ భాష కింద హిందీనే నేర్పడం కద్దు. కేంద్రం నిధులు యంత్రాంగం, పథకాలు అన్నీ ఆ దిశలోనే వున్నాయి తప్ప ఇతర భాషల కోసం ఎలాంటి ఏర్పాటు లేదు. ఇంగ్లీషుతో పాటు తమిళం ఎలాగూ నేర్చుకుంటున్నప్పుడు హిందీని తప్పనిసరి చేయడమేమిటని తమిళనాడులో గత వందేళ్లుగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యం చూడకుండా త్రిభాషా విధానం అమలు చేయకపోతే కేంద్ర విద్యా నిధులు నిలిపేస్తామని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వంటి వారు నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామికం. బాధ్యతా రహితం. ఈ బలవంతపు శాసనాలు ఆపకుండా తమిళులు హిందీ వ్యతిరేకులన్నట్టు వారిపై అభాండాలు వేయడం అనుచితం. అంతటితో ఆగక పవన్ తెలుగువారిని తమిళులు అవమానిస్తారని చెబుతున్నారు. మద్రాసీలుగా పిలవబడే తెలుగువారి ఆత్మగౌరవం ఎన్టీఆర్ వల్లనే నిలబడిందని టిడిపి వారు, ఆయన అభిమానులు చెబుతుంటారు. ఎన్టీఆర్‌ను గౌరవించవచ్చు గాని అంతకు ముందే మహా నాయకులెందరో వున్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాటం వంటి ఘట్టాలూ వున్నాయి. ప్రజాస్వామ్య చైతన్యమూ వుంది. నిజానికి పవన్ అపహాస్యం చేసిన పెరియార్ వంటి వారి ద్రావిడ భావజాలం ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాల్లో చూస్తాం. ఈయనే గతంలో 'హిందీ గో బ్యాక్' నినాదాన్ని రీ ట్వీట్ చేయడం, 'ప్రత్యేక ప్యాకేజి పాచిపోయిన లడ్డు' అంటూ హిందీలో మాట్లాడి కేంద్రాన్ని ఎగతాళి చేయడం మర్చిపోలేము. తమిళ చిత్రాలు హిందీలో డబ్ చేయొద్దని పవన్ కళ్యాణ్ మాట్లాడ్డం హాస్యాస్పదమే. ఎందుకంటే అక్కడ హిందీ సినిమాలు బాగా ఆడతాయి. షారుఖ్ ఖాన్, దీపికా పదుకునే 'చెన్నై ఎక్స్‌ప్రెస్', రజనీకాంత్ ధారావిపై తీసిన 'కాలా' వంటి చిత్రాలు కూడా చూశాం. ఇప్పుడు పాన్ ఇండియా యుగంలో దక్షిణాది పైనే హిందీ పరిశ్రమ చూపు వుంటున్నది. అవగాహనా రాహిత్యం, అవకాశవాదం అనర్థదాయకం. సున్నితమైన భాషా సాంస్కృతిక సమస్యలను విశాల దృష్టితో చూడకుండా సనాతన సులోచనాలు తగిలించుకోవడం వల్ల సమగ్రంగా చూడలేక అరకొర వ్యాఖ్యలు చేస్తున్నారు. సినిమాల నుంచి ప్రాంతాలు, మతాల వరకూ ప్రతి విషయంలోనూ మోడీని మోయడమే కార్యక్రమంగా పెట్టుకున్న ఫలితమిది. ప్రకాశ్ రాజ్ దీనికి సరిగ్గానే సమాధానమిచ్చారు. 22వ తేదీ సమావేశం ఈ విషయంలో సహేతుక సూచనలు చేస్తుందని కేంద్రం కూడా సానుకూల దృష్టిలో ప్రజాస్వామికంగా నిర్ణయాలు తీసుకోవాలనీ ఆశిద్దాం. ★

> హిందీ రాష్ట్రాలలో ఆ భాష నేర్చుకుంటే సరిపోతుంది గాని ఇతర చోట్ల మరో భారతీయ భాష కింద హిందీనే నేర్పడం కద్దు. కేంద్రం నిధులు యంత్రాంగం, పథకాలు అన్నీ ఆ దిశలోనే వున్నాయి తప్ప ఇతర భాషల కోసం ఎలాంటి ఏర్పాటు లేదు. ఇంగ్లీషుతో పాటు తమిళం ఎలాగూ నేర్చుకుంటున్నప్పుడు హిందీని తప్పనిసరి చేయడమేమిటని తమిళనాడులో గత వందేళ్లుగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యం చూడకుండా త్రిభాషా విధానం అమలు చేయకపోతే కేంద్ర విద్యా నిధులు నిలిపేస్తామని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వంటి వారు నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామికం. బాధ్యతా రహితం.



తెలకపల్లి రవి

'ఇండియా' కూటమి లేనట్టేనా?

కత్తిరింపులు

సిపిఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ఈ నెల 9వ తేదీన గమనార్హమైన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తర్వాత ఇంకా ఎవరూ ఆ స్థానంలోకి రాలేదు. కరత్ పొలిట్ బ్యూరో సమన్వయకర్తగా నియమితులయ్యారు. అది ప్రస్తుతానికి ప్రధాన కార్యదర్శి వంటి హోదా. పైగా ఆయన స్వయంగా లోగడ ఆ హోదాలో పని చేశారు. అందువల్ల తన మాటలకు తగినంత ప్రాధాన్యత ఉంటుంది. అంతేకాదు. కరత్‌కు మార్క్సిస్ట్ సిద్ధాంతాలలో నిష్ణాతుడనే పేరు పార్టీలో, బయటా కూడా ఉన్నది......

కరత్ మాట్లాడిన సందర్భం సిపిఎం కేరళ శాఖ సభలు కొల్లామ్ పట్టణంలో జరగటం. ఆ సభలు ఒక రాష్ట్రానికి సంబంధించినవి. ఆయన మాటలు నేరుగా తన ప్రసంగంలో అన్నవి గాక, విడిగా ఒక పత్రికా ప్రతినిధితో చెప్పినవి. అందువల్ల వాటికి తగిన ప్రచారం రాలేదు. కానీ అవి మొదట అనుకున్నట్లు గమనార్హమైనవి: 'ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరిట ఏర్పడిన 26 బిజెపి యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే. ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధా నాలు, సిద్ధాంతాలు, నాయకులు ఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. ఒక సమన్వయ కమిటీ ఏర్పాటుకు ఇతర పార్టీలు ప్రయత్నించాయిగానీ అది ఆచరణలో పని చేయగలది కాదన్నాము. దానితో, నాయకులు మాత్రం కలుస్తుండేవారు. కొన్ని కమిటీలు ఏర్పాటు చేశారు గానీ అవేవీ పని చేయ లేదు. సీట్ల సర్దుబాటుపై జాతీయ స్థాయి చర్చలు వీలయేవి కాదు గనుక ఆ పని ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంగా జరగాలన్నాము మేము. ఉదాహరణకు మా పార్టీ బెంగాల్‌లో, కేరళలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయదు. మొత్తానికి ఆ పద్ధతి పనిచేసి బిజెపి సొంత మెజారిటీ కోల్పోయి 240 స్థానాలకు తగ్గింది. అందువల్ల, ఇండియా కూటమి అన్న ఆలోచనే లోక్‌సభ ఎన్నికలకు పరిమితమైనటువంటిది... లోక్ సభ ఎన్నికల అనంతరం తమకు అసలు ఒక ఉమ్మడి వేదిక అవస రమా? అయితే ఏ విధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి. ఒక వేళ వేదిక ఎన్నికల కోసమే అయితే, ఇపుడు చేయవలసింది ఏమీ ఉండదు' అన్నారు సిపిఎం సమన్వయకర్త.



కూటమి భవిష్యత్తు?

కరత్ వెల్లడించిన అభిప్రాయాలలో ఇండియా కూటమి ఏవిధంగా వ్యవహరించిందన్న గత పరిస్థితులకే పరిమితమ య్యారనే భావన కలగవచ్చు. కానీ అందులో అంతర్లీనంగా, ప్రతిపక్షాలు మౌలికంగా ఎట్లా పనిచేస్తున్నాయి, భవిష్యత్తులో ఏ విధంగా పని చేయా లనే కోణాలు కూడా కనిపిస్తాయి. చెప్పాలంటే ఈ ప్రశ్నలు ప్రతి పక్షాలకు 1977 నాటి జనతా పార్టీ నుంచి మొదలుకొని తర్వాత కాలంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల కాలంలో, ఇంకా తర్వాత కాంగ్రెస్ నాయకత్వాన ఏర్పడిన యుపిఎ హయాంలోనూ కొనసాగినవే. ఇండియా కూటమి బలహీనతలు, వైఫల్యాల వెనుక కూడా ఇదంతా ఉంది.

కూటమికి వ్యవస్థాత్మక నిర్మాణాన్ని సిపిఎం వ్యతిరేకించటానికి కారణం అందులో పలు రకాల విధానాలు, సిద్ధాంతాలు గల పార్టీలు, నాయకులు ఉండటం. దీనికి సమాధానాలు కనుగొనలేకపోయినందువల్లనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి కూటమికి భంగపాట్లు ఎదురు కావటం జరిగింది. అటువంటి భంగపాట్లు జనతా పార్టీ కాలం నుంచి గత 48 సంవత్సరాలుగా ప్రతిపక్షాలకు ఎదురవుతూనే ఉన్నాయి. అందుకు ఒక కారణం వారి వైఫల్యాలు కాగా, మరొకటి భారతదేశపు మహా విస్తారమైన వైవిధ్యత.

ఇన్నిన్ని ప్రాంతాలు, సైద్ధాంతిక, విధానపర, రాజకీయ వైవిధ్యతలు ఉన్నపుడు ఏకాభిప్రాయాలు, విభేదాలకు అవకాశం ఉండని సమష్టి నాయకత్వాలు తేలిక కాదు. కాంగ్రెస్, బిజెపి ల వలె నిర్దిష్ట దీర్ఘకాలిక చరిత్రలు, నాయకత్వాలు, సిద్ధాంతాలు ఉన్నపుడు అది సాధ్యమవుతుంది. లేదా ఎమర్జెన్సీ వంటి అసాధారణ పరిస్థితి ఏర్పడి దేశాన్ని ఒకటి చేయటం వంటిది జరగాలి. వీటన్నింటి మధ్య స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఒక పాయగా సాగుతుండిన సోషలిస్టు రాజకీయం సరిగా కుదురుకొని ఉంటే ఏమి జరిగేదో గానీ పలు కారణాలవల్ల అది ఛిన్నాభిన్నమైంది.

మరొకవైపు, కేవలం ఎమర్జెన్సీ పట్ల వ్యతిరేకతతో ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట ఏర్పడిన జనతా పార్టీ, తర్వాత 'యాంటీ కాంగ్రెసిజం' ఆలోచనలతో ముందుకు వచ్చింది. తాము ఒకప్పటి కాంగ్రెస్ సంప్రదాయంలో వామపక్షపు మొగ్గ గల మధ్యే మార్గ ప్రత్యామ్నాయం కాగలమన్న ఫ్రంట్ కూటములు అదే దశలో చెదిరిపోయాయి.



> **'ఇం**డియా' పేరిట ఏర్పడిన 26 బిజెపి యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే. ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధానాలు, సిద్ధాంతాలు, నాయకులు ఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. లోక్‌సభ ఎన్నికల అనంతరం తమకు అసలు ఒక ఉమ్మడి వేదిక అవసరమా? అయితే ఏవిధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి.
>
> **– ప్రకాశ్ కరత్,**
> **సిపిఎం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త.**

కనీస ఉమ్మడి కార్యక్రమం ఏమిటి?

అయితే, ప్రకాశ్ కరత్ మాటలను పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే, 1977 నాటి జనతా పార్టీ కాదుగానీ, 1989లో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ కొంత భిన్నంగా కనిపించింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన తీవ్ర అవినీతి ఆరోపణలతో అదే పార్టీకి చెందిన వి.పి. సింగ్ వంటి ముఖ్య నేతలు బయటకు రావటం, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించి వేస్తున్నదనే ఫిర్యాదుతో పలు ప్రాంతీయ పార్టీలు, ప్రభుత్వాలు, ఎమర్జెన్సీ–జనతా పార్టీ దశలో ఒకటై తిరిగి చెదిరిపోయిన సోషలిస్టు వర్గాలు, ఉభయ కమ్యూనిస్టులు, దేశవ్యాప్తంగా సమాజంలోని ప్రజాస్వామికవాదులు ఒకే వేదిక పైకి వచ్చి చేరారు.

అంతేగాక, వి.పి. సింగ్, ఎన్టీఆర్‌ల నాయకత్వాన బిజెపి ని ఒక అడుగు దూరంలోనే ఉంచివేశారు. ఈ వైవిధ్యతల మధ్య అపుడు ప్రకాశ్ కరత్ ఉద్దేశిస్తున్నది ఒకటి జరిగింది. అది, ఎన్నికలకన్నా ముందే వివిధ పార్టీల మధ్య సుదీర్ఘ చర్చల ద్వారా 'కనీస ఉమ్మడి కార్యక్రమం' ఒకటి రూపొందించటం. అది దేశ ప్రజానీకానికి ఒక కొత్త విశ్వాసాన్ని కలిగించిన మాట నిజం.

అయితే కొందరు సీనియర్ల అధికార కాంక్షలు, మందిర్–మండల్ వివాదాల మూలంగా ఆ ప్రయోగం భంగపడటం తెలిసిందే. అది జరగనట్లయితే దేశ రాజకీయాలు మరొక విధంగా ఉండేవేమో. సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్ కరత్ అపుడంతా జాతీయ స్థాయిలో ఈ పరిణామాలను ప్రత్యక్షంగా గమనించిన వ్యక్తి. ప్రస్తుత 'ఇండియా' కూటమికి సంబంధించిన పరిణామాల వరకు తనకు తెలియనిది లేదు. అందువల్లనే ఆ కూటమి ఏర్పాటు తీరు, లక్ష్యాలు, పని తీరు, పరిమితులు, సాఫల్య వైఫల్యాల గురించి అంత స్పష్టంగా చెప్పగలిగారు.

ఈ విషయాన్ని కొంత ముందుకు తీసుకువెళ్ళినట్లయితే, ఆయన ఎత్తి చూపిన సైద్ధాంతిక, విధానపరమైన వైవిధ్యతలు, వైరుధ్యాల నుంచి, నాయకుల వ్యక్తిగత ధోరణుల నుంచి బిజెపి యేతర పార్టీలు బయటకు రాగలగటం, నేషనల్ ఫ్రంట్ వలె కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించుకోవటం ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్న. అందుకు బిజెపి వ్యతిరేకత అన్నదొక్కటే చాలదు. తమ వైపు నుంచి ప్రజలకు చూపించే ప్రత్యామ్నాయ పాజిటివ్ ఆర్థిక, సామాజిక, అభివృద్ధి అజెండా తప్పనిసరి. ఎన్నికల తర్వాత ఏమిటన్న చర్చ 'ఇండియా' కూటమిలో ఎప్పుడూ జరగలేదని కరత్ ఎత్తిచూపింది ఈ విధమైన కొరతనే!

- టంకశాల అశోక్,
సీనియర్ జర్నలిస్ట్
/ 'సాక్షి' సౌజన్యంతో /

ఆర్‌టిసి స్పేర్ టైరుపై వ్యక్తి ప్రయాణం

కొత్తచెరువు:కొత్తచెరువు నుంచి హిందూపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో శనివారం ఓ విచిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం ఓ వ్యక్తి మద్యం మత్తులో బస్సు వెనుక భాగంలో ఉన్న స్పేర్ టైర్ ఎక్కి నిద్రపోయాడు. ఇది గమనించని డ్రైవర్, కండక్టర్ కొత్తచెరువు నుంచి హిందూపురం బయల్దేరారు. సుమారు 20 కిలోమీటర్లు వెళ్లిన తరువాత కొండపల్లి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తులు గుర్తించి బస్సును ఆపారు. దీంతో డ్రైవర్, కండక్టర్ బస్సు కింద భాగంలో స్పేర్ టైర్ కింద నిద్రిస్తున్న వ్యక్తిని తీవ్రంగా మందలించి కిందికి దింపి పంపించారు.

రెప్పపాటులో ఘోరం

- టైరు పేలి బైక్‌ను, లారీని ఢీకొన్న కారు
- ఆపై బోల్తా పడిన వైనం
- ప్రమాదంలో నలుగురు మృతి
- పుట్టినరోజు వేడుకలకు వెళ్తుండగా ఘటన

ప్రజాశక్తి- లావేరు (శ్రీకాకుళం జిల్లా)

రెప్పపాటులో ఘోరం జరిగిపోయింది. శ్రీకాకుళం జిల్లా బుడుమూరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... పాతపట్నం మండలం పెద్దలోగిడికి చెందిన దువ్వూరి కాళిదాసు తన కుటుంబంతో కలిసి విశాఖపట్నంలో పుట్టినరోజు వేడుకలకు కారులో వెళ్తున్నారు. ఆయన కుమారుడు దువ్వూరి లక్ష్మీపతి (28) కారును డ్రైవ్ చేస్తున్నారు. బుడుమూరు సమీపంలో తనకంటే ముందు ద్విచక్ర వాహనంతో విజయనగరం జిల్లా సంతకవిటి మండలం ముద్దురుగ్రామానికి చెందిన తోలాపి శంకరరావు (35) శ్రీకాకుళంలో వైద్య పరీక్షలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. వెనుక నుంచి వస్తున్న కారు టైరు పేలి ముందు వెళ్తున్న శంకరరావు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరరావు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అదేవేగంతో వెళ్లి విశాఖపట్నం వైపు వెళ్తున్న సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న లారీని కారు ఢీకొని బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న దువ్వూరి కాళిదాసు భార్య మీనాక్షి మినమ్మ (60), కుమారుడు లక్ష్మీపతి (28) కారులోనే మృతి చెందారు. కాళిదాసు అల్లుడు ఉగ్గురిపల్లి భాస్కరరావు (40) తీవ్రంగా గాయపడడంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. కాళిదాసు మనుమరాలు కుసుమశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా సర్వజనాస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు, బైకుదారుడు మృతి చెందడంతో ప్రమాద స్థలం రక్తసిక్తమైంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, జెఆర్.పురం సిఐ ఎం.అవతారం, లావేరు ఎస్ఐ గదుల లక్ష్మణరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, 2011లో ఇదే ప్రాంతానికి సమీపంలో కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక కుటుంబానికి ఆరుగురు మృత్యువాత పడ్డారు.

హాజరు పట్టికలో ముందుగానే సంతకాలు

- ఎమ్మెల్యే తనిఖీలో వెల్లడి
- అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి - తనకల్లు



మండల పరిధిలోని సిజి ప్రాజెక్టులో గల గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు చేస్తున్న ఆక్రమాలు ఎమ్మెల్యే తనిఖీలో బయటపడ్డాయి. తాము విధులకు హాజరుకాకున్నా ముందురోజులకు కూడా హాజరుపట్టికలో కొందరు ఉపాధ్యాయులు సంతకాలు చేశారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం మండల పరిధిలోని సిజి ప్రాజెక్టులో గల గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను ప్రిన్సిపల్ సుస్మిత జ్యోత్స్నను అడగగా ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఎమ్మెల్యే రికార్డులను పరిశీలించారు. అందులో 15, 17, తేదీలకు సంబంధించిన అటెండెన్స్‌లో ముందుస్తుగానే ఇద్దరు ఉపాధ్యాయులు సంతకాలు పెట్టడాన్ని గమనించి ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గతంలోనూ విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారని ఇప్పటికి అదే తంతు జరుగుతోందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మెనూ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి విద్యార్థినులతో వడ్డించడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి పరిస్థితులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా తెలిపారు.

చిన్నారుల హత్య కేసులో సందేహాలెన్నో!

- పోస్టుమార్టం పూర్తి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులను కన్న తండ్రే అతి పాశవికంగా హతమార్చాడు. కళ్లకు గంతలు కటి, రెండు కాళ్లకు తాడు కట్టి, రెండు చేతులను వెనక్కి వంచి కదలకుండా తాడుకట్టి, నీళ్ల బకెట్లలో తలలు ముంచి ఊపిరి తీశాడు. ఆ తర్వాత తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హోలీ పండుగ రోజు కాకినాడలోని సుబ్బారావునగర్‌లో జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం కాకినాడ జిజిహెచ్‌లో ఇద్దరు చిన్నారులు, తండ్రి చంద్రకిషోర్ మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. సర్పవరం సిఐ పెద్దిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన వానపల్లి చంద్రకిషోర్ (37) కాకినాడ జిల్లా వాకలపూడిలోని ఓఎన్‌జిసి కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. నగరంలోని తోట సుబ్బారావునగర్ రోడ్డులోని భూదేవి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఏడేళ్ల క్రితం తనూజతో వివాహమైంది. వారికి జోషిల్ (6), నిఖిల్ (5) పిల్లలు ఉన్నారు. వారు సరిగా చదవకపోవడంతో ఇటీవల పాఠశాలను మార్పించారు. హోలీ పండుగ సందర్భంగా తన భార్య, పిల్లలను తీసుకుని వాకలపూడిలోని తమ ఆఫీసులో వేడుకకు వెళ్లాడు. పిల్లలకు యూనిఫాం కుట్టించేందుకు టైలర్ వద్దకు వెళు_న్నానని, పది నిమిషాల్లో వస్తానని భార్యను అక్కడే ఉండమని చెప్పి పిల్లలను వెంట తీసుకెళ్లారు. పిల్లలను ఇంటికి తీసుకెళ్లి అతి దారుణంగా హత్య చేశారు. అనంతరం తానూ ఉరేసుకుని చంద్రకిషోర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనా స్థలంలో పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తన పిల్లలు పోటీ పడలేకపోతున్నారని, వారికి భవిష్యత్తు లేదని, అందుకే ఇద్దరు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో రాసినట్లు పోలీసులు తెలిపారు. అయితే, పిల్లల మృతిపై పోలీసులు, స్థానికులు పలు అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు పిల్లలను ఒకేసారి ఎలా చంపి ఉంటారని ఆరా తీస్తున్నారు. ఇంత జరుగుతున్నా పక్క ప్లాట్లలలో నివసిస్తున్న వారికి వినిపించకుండా పకడ్బందీగా ఎలా చేయగలిగారనే దానిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఫీజులు చెల్లించలేకపోవడం, సరిగా చదవకపోవడం వంటి చిన్న కారణానికే ముక్కుపచ్చలారని చిన్నారులను పొట్టన పెట్టుకునే కర్కస మనస్తత్వం తండ్రికిలేదని బంధువులు పేర్కొనడం గమనార్హం. భార్య తనూజ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నాపురం రేంజర్, సబ్ డిఎఫ్ఒను సస్పెండ్ చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కన్నాపురం రేంజర్ సబ్ డిఎఫ్ఒను వెంటనే సస్పెండ్ చేసి ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. గుల్లపూడి గ్రామ పెద్దల సమావేశం మడకం వెంకమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, గిరిజన జ్యోతి జిల్లా అధ్యక్షులు కురం సత్యనారాయణ దొర మాట్లాడుతూ.. మడకం యాకోబుపై దాడి చేసి ఐదు రోజులవుతున్నా కన్నాపురం రేంజర్ సబ్ డిఎఫ్ఒపై ఎటువంటి యాక్షన్ తీసుకోలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినప్పటికీ తాత్సారం చేస్తున్నారన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోకపోతే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మడకం యాకోబుకు మెరుగైన వైద్యం చేయించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ ఆదివాసీ పాస్టర్ అసోసియేషన్ నాయకులు పీలీప్ పూనెం శేఖర్, తెల్లం ఇశ్రాయేలు, గిరిజన సంఘం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, మడకపాటి అనూష, పూనెం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత

- విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని డి.హీరేహాల్ మండలం కాదలూరు గ్రామంలో సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్‌కు భూములిచ్చిన రైతులతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ ఉపయోగ, వ్యవసాయ రంగాలతో పాటు పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వాడకం అధికం అవుతోందన్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సోలార్ ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.31వేలు చొప్పున రైతు అకౌంట్‌కు నగదు జమ అవుతుందన్నారు. ఎన్‌టిపిసి, జిందాల్ లాంటి విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు కేవలం మీ భూములు అద్దెకు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. భూమిపై అన్ని హక్కులూ రైతులకే ఉంటాయన్నారు. కావాల్సినప్పుడు భూమి ఎవరికైనా అమ్ముకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులు బాగ పరిష్కారాలు కూడా చేసుకోవచ్చన్నారు. ప్రతి రెండేళ్లకు 5శాతం చొప్పున అద్దె పెంచనున్నట్లు వివరించారు. అత్యంత వెనుకబడ్డ రాయదుర్గం నియోజకవర్గంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అడుగులు పడుతున్నాయన్నారు. 7500 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ఈ ప్రాంతంలో అవకాశాలుంటాయన్నారు. సోలారు పార్కులకు భూములు ఇవ్వటానికి స్వచ్ఛందంగా రైతు సోదరులు ముందుకు రావడం సంతోషించతగ్గ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యుత్ ఉత్పత్తి కంపెనీల ప్రతినిధులు, నెడ్ క్యాప్ మేనేజర్ శివశంకర్, జిందాల్ ఎండి కనకారావు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, నాగల్లి రాజు, తహశీల్దార్ మునివేలు, తదితరులు పాల్గొన్నారు.

మధురమలై కొండలు ఆహుతి

- వేల ఎకరాల్లో పచ్చదనం కనుమరుగు
- ప్రాణాలు కోల్పోతున్న మూగజీవాలు
- అవగాహన కల్పించని అటవీశాఖ



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పరిధిలోని మధురమలై కొండలు శనివారం సాయంత్రం ఆకతాయిలు రగిలించిన మంటల కారణంగా వేల ఎకరాలలో అటవీ సంపద కాలి బూడిదైంది. సోమల చౌడేపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న మధురమలై కొండలు అగ్నికి ఆహుతి అవుతూ ఉండడం రహదారిపై వెళ్లే వారు చూసి ఆవేదన చెందడం కనిపించింది. పచ్చని కొండలు ఆకతాయిలు చేసే దుశ్చర్యల కారణంగా కాలి బూడిద గుట్టలుగా మారుతున్నాయని పచ్చని చెట్లు పక్షులు, జంతువులు వన మూలికలు అగ్నికి ఆహుతి అవుతున్నా అటవీ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది వేసవి రావడం పచ్చని కొండలకు అగ్గిపెట్టి కాల్చి బూడిద చేయడం రివాజుగా మారుతోందని అటవీ సమీప గ్రామాల ప్రజలకు, గొర్రెల కాపరులకు అటవీ శాఖ సిబ్బంది అవగాహన కల్పించి గ్రామసభలు నిర్వహించి అటవీ సంపదను కాపాడుకోవాల్సిన అవసరం గురించి తెలపాల్సి ఉండగా అటువంటి కార్యక్రమాలు ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. గోడ పత్రికలు గ్రామాలలో అతికించడం, అడవికి నిప్పు మానవాళికి ముప్పు అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి అటవీ సంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇకనైనా అటవీ శాఖ వారు ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహించి అడవికి నిప్పు పెట్టే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోడీ పాలనలో దేశాభివృద్ధి శూన్యం

- మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 11 ఏళ్ల పాలనలో పదివేల జతల దుస్తులు మార్చాడే తప్ప దేశాభివృద్ధికి చేసింది శూన్యమని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మం అంటే గంగా నదిలో మునగడం, ఊగిపోవడం, అయోధ్యలో దండం పెట్టడం కాదని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి వ్యంగాస్త్రాలు సంధించారు. అంటరానితనం నిర్మూలన, దళితులకు దేవాలయ ప్రవేశం, స్వతంత్రోద్యమంలో అందరికీ సమానత్వం కల్పించడం, టిబి శానిటోరియం, బిటి కాలేజ్‌లను పునరుద్ధరించడమన్నారు. ప్రజలు జగన్‌కు భయపడే కూటమి ప్రభుత్వంకు అధికారం ఇచ్చారు తప్ప, పవన్ కల్యాణ్ చెప్పుకొంటున్నట్లు వందశాతం స్ట్రైక్‌రేట్ కాదన్నారు. కాంగ్రెస్ పాలనలో భూ సంస్కరణలు తేవడం, బ్యాంకులను జాతీయకరణ చేయడం జరిగిందని, మోడీ పాలనలో ఒక్కటంటే ఒక్క సంస్కరణ కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. అధికారం కోసం జగన్ పగటి కలలు మానుకోవాలని, తానేదో తిరిగి అధికారం చేపడతానని అనుకోవడం ఆయన మూర్ఖత్వమేనన్నారు. ప్రజలను ఒక్క అవకాశమే అడిగారని, అది అయిపోయిందని, ఇక జగన్ అధికారంలోకి రావడం కలే నన్నారు.



శ్రీనివాసుని కల్యాణోత్సవంలో గవర్నర్, ముఖ్యమంత్రి తదితరులు

రాజధానిలో వైభవంగా శ్రీనివాస కల్యాణం

- హాజరైన గవర్నర్, సిఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో కొలువైన శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలక మండలి ఆధ్వర్యాన శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. వెంకటపాలెంలోని శ్రీవారి ఆలయం నుండి సతీసమేతంగా నారా చంద్రబాబు నాయుడు దంపతులు విచ్చేసి స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి విచ్చేసిన తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ చినజీయర్ స్వామి, అహోబిల మఠాధిపతి శ్రీ రామానుజ జీయర్ స్వామి, శివ స్వామి, పంచ సహస్రావధాని మేడసాని మోహన్, ప్రముఖ భగవద్గీత ఉపన్యాసకులు శ్రీ గంగాధరశాస్త్రి వ్యాఖ్యానం చేశారు. చెన్నైకు చెందిన ప్రముఖ గాయకురాలు నిత్యశ్రీ మహదేవన్, ప్రియా సిస్టర్స్ సంకీర్తనలు శ్రోతలను తన్మయం చేశాయి. నాలుగు టన్నుల పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్, వివిధ రకాల ఫలాలతో కల్యాణ వేదికను అలంకరించారు. తిరుమల శ్రీవారి ఆలయం నుండి తీసుకొచ్చిన 50 వేల చిన్న లడ్డూలను కల్యాణానికి విచ్చేసిన ప్రజలకు పంపిణీ చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టిడిపి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ జె.శ్యామలరావు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మెరుగ్గా ఇండస్ ఇండ్ బ్యాంకు పరిస్థితి : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : ప్రముఖ ప్రైవేటురంగ బ్యాంకు ఇండస్ ఇండ్ ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. బ్యాంకుపై వస్తున్న ఊహాజనిత కథనాలకు డిపాజిటర్లు స్పందించవద్దని సూచించింది. బ్యాంకుకు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించడంతో స్టాక్‌మార్కెట్లలో బ్యాంకింగ్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డిపాజిటర్లు ఆందోళనకు గురికాకుడదన్న ఉద్దేశంతో ఈ ప్రకటన విడుదల చేసింది.

ప్రైవేటురంగ ఇండస్ ఇండ్ బ్యాంకులో దాదాపు రూ.2,100 కోట్ల మేర అకౌంటింగ్ తేడాలు వెలుగుచూశాయి. కరెన్సీ డెరివేటివ్స్‌కు సంబంధించిన అవకతవకలను గతేడాది సెప్టెంబరు-అక్టోబరులో గుర్తించినా, ఇండస్ ఇండ్ బ్యాంకు ఇప్పుడు బహిర్గతం చేసింది. ఫలితంగా ఇండస్ ఇండ్ బ్యాంకు షేరు భారీగా పతనమై చిన్న మదుపర్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు భారీ నష్టం వాటిల్లింది. ఖాతాల్లో లోపాల కారణంగా మార్చి త్రైమాసికంలో ఇండస్ ఇండ్ బ్యాంకు రూ.1600 కోట్ల నష్టాన్ని చవిచూడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత త్రైమాసికంలోనే పరిష్కార చర్యలను పూర్తిచేయాలని ఇండస్ ఇండ్ బ్యాంకు బోర్డుకు ఆర్‌బిఐ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

విద్యుత్ ఛార్జీలు, పన్నుల భారాలతో అల్లాడుతున్నాం

- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం బృందానికి ప్రజల మొర

ప్రజాశక్తి-యంత్రాంగం

'టిడ్కో గృహాలు అప్పగించకపోవడంతో అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తున్నాం. మురుగు నీటి సమస్య, డ్రెయినేజీ వ్యవస్థతో రోగాలపాలవుతున్నాం. విద్యుత్ ఛార్జీలు, పన్నుల భారాలతో అల్లాడుతున్నాం' అంటూ సిపిఎం నాయకుల వద్ద ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం కొనసాగాయి. వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ఇటీవల పెంచిన ఇంటి పన్ను, చెత్త పన్నుల గురించి స్థానికులు ఏకరువు పెట్టారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. గిరిజనేతరులు తమ భూములను ఆక్రమించు కుంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటిస్తున్న సిపిఎం బృందం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో సిపిఎం రాష్ట్ర నాయకులు వై.రాము, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకొచ్చారు. 'టిడ్కో గృహాలు ఇస్తామని చెప్పి డబ్బులు కట్టించుకున్నారు.. ఏళ్లు గడుస్తున్నా నేటికీ గృహాలు స్వాధీనం చేయలేదు.. ఇంటి అద్దె కట్టలేక.. బ్యాంకు రుణాలు చెల్లించలేక.. బ్యాంకు అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక.. ఇబ్బందులు పడుతున్నాం'. అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని పేదలతో టిడ్కో ఇళ్లు అందరికీ ఇస్తామని డబ్బులు కట్టించుకుని నేటికీ ఇళ్లు స్వాధీనం చేయకపోవడం దుర్మార్గమని తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండల పరిధిలోని వలసపాకల గ్రామంలో ప్రజలు పలు సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తెచ్చారు. లో వోల్టేజీ సమస్యతో గృహాల్లో ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో దోమలు గురవుతున్నామని తెలిపారు. విజయనగరం జిల్లా జొన్నగుడ్డిలో ప్రజా సమస్యలపై సిపిఎం నాయకులు సర్వే నిర్వహించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విజయనగరం, బొబ్బిలి, శృంగవరపుకోటలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. విజయనగరంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం పట్టణాల్లో పేదలకు 2 సెంట్లు భూమి ఇస్తామని చెప్పిందని, వెంటనే అమలు చేయాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు ఆధ్వర్యంలో సిపిఎం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటిడిఎ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరి అన్నారు. అనకాపల్లిలోని దాసరిగెడ్డ రోడ్డు, ముత్రాస్ కాలనీ ప్రాంతాల్లో సిపిఎం నేతలు పర్యటించారు. రాంబిల్లి మండలం కొత్తపట్నం, కె.కోటపాడు మండలం ఎ.కోడూరు, ఎ.భీమవరం, పొడుగుపాలెం, మేడిచర్ల గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అల్లూరి జిల్లాలోని కొయ్యూరు మండలం ఉసిరికపాడు లోనూ, అరకులోయ మండలంలోని బొండం పంచాయతీ కొత్తవలస గ్రామంలోనూ ప్రజా చైతన్య యాత్రలు సాగాయి. నెల్లూరు జిల్లాలోని నెల్లూరు, నెల్లూరురూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు, ముత్తుకూరు మండలాల్లో సిపిఎం నేతలు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. నెల్లూరు రూరల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆధ్వర్యంలో సిపిఎం ప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిశారు. చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారంకాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'సెకీ'పై అసెంబ్లీని తప్పుదోవ పట్టిస్తున్న సిఎం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కమీషన్ల కోసమే జగన్ విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారని చెబుతున్న సిఎం చంద్రబాబు సెకీతో జరిగిన ఒప్పందాన్ని ఎలా సమర్థిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. ఇది అసెంబ్లీని తప్పుదోవ పట్టించడమేనని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెకీ ఒప్పందంలో రూ.1,750 కోట్లు చేతులు మారినట్లు అమెరికాలో కేసు నమోదైనా, దీనిపై చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదన్నారు.

అసెంబ్లీలో సిఎం అవాస్తవాలను మాట్లాడితే ఇంతకంటే ఘోరమైన విషయం మరొకటి ఉందన్నారు. సెకీ ఒప్పందం వల్ల భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలపై రూ.1.10 లక్షల కోట్లు భారం పడుతోందని స్పష్టమవుతున్నా సిఎం ఒప్పందాన్ని సమర్థిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సెకీతో ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బిజెపి స్క్రిప్ట్ చదివిన పవన్

జనసేన ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో బిజెపి స్క్రిప్ట్ చదివినట్లు ఉందని రామకృష్ణ విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల్లో బలవంతంగా హిందీ భాషను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సెక్యులర్ వాదిగా చెప్పుకున్న పవన్ కొంతకాలంగా హిందూ ధర్మం, సనాతన వాదం అంటూ వేష భాషలు మార్చారన్నారు.

హోంగార్డుల వేతనాలు పెంచాలి

రాష్ట్రంలో హోంగార్డులకు వేతనాలు పెంచాలని, పోలీసు సెలక్షన్లలో తగిన ప్రాధాన్యత కల్పించాలని రామకృష్ణ కోరారు. ఈ మేరకు హోంమంత్రి వి అనితకు లేఖ రాశారు. హోంగార్డుల సమస్యలపై దృష్టి సారించి వేతనాలు పెంచడంతోపాటు, పోలీస్ సెలక్షన్ల నిబంధనల్లో సడలింపులు కల్పించాలని కోరారు.

7 నుంచి సైబర్ సెక్యూరిటీ సర్టిఫికేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సైబర్ సెక్యూరిటీ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ఏప్రిల్ 7న ప్రారంభం కానుందని సైబర్ సెక్యూరిటీ సంస్థ సెక్యూర్ ఐస్ వెల్లడించింది. మూడు నెలలపాటు ఆన్‌లైన్‌లో ఈ కోర్స్ ఉంటుందని సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. సైబర్ నేరాలు పెరిగిపోవడంతో సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం పెరిగిందని పేర్కొంది. ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ సర్టిఫికేషన్ కన్సార్టియం పరిశోధన ప్రకారం దాదాపు 3 మిలియన్ల సైబర్ సెక్యూరిటీ నిపుణుల కొరత ప్రపంచ వ్యాప్తంగా ఉందని తెలిపింది. ఏప్రిల్ 7న ప్రారంభమయ్యే బ్యాచ్‌కు సైబర్ సెక్యూరిటీ నిపుణుల నేతృత్వంలో ప్రత్యక్ష సెషన్లు ఉంటాయని పేర్కొంది. మరిన్ని వివరాల కోసం secureyes.net/academy వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపింది.



కర్నూలు కొండారెడ్డి బురుజువద్ద రోడ్లను శుభ్రం చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కలెక్టర్ రంజిత్ బాషా, ఇతర అధికారులు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రజలకు జిల్లా ఇన్‌ఛార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే విజ్ఞప్తి చేశారు. శనివారం కర్నూలు కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన, జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సమావేశంలో పాల్గొన్న ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ప్లాస్టిక్ ఫ్రీ భోజన ప్లేట్లు, నేలను శుభ్రం చేసే ప్లాస్టిక్ ఫ్రీ మ్యాప్‌లు తదితర వస్తువుల ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో మొక్కలు నాటి, కొండా రెడ్డి బురుజు దగ్గర స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని రోడ్లను శుభ్రపరిచారు. కాంతిలాల్ దండే మాట్లాడుతూ.. 30 ఏళ్ల కిందట మన ఇంటికి పెద్దవారు గొడుగు, చేతి సంచి, ఇత్తడి మరచెంబుతో వచ్చేవారన్నారు. ప్రస్తుత కాలంలో అవన్నీ వెళ్లిపోయి, వాటి స్థానంలో ప్లాస్టిక్ ఆక్రమించి, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ నీళ్ల బాటిళ్లు వచ్చాయన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతి సంచి తీసుకువెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఇ మహేశ్వర రెడ్డి, ఇఇ సురేష్, స్వయం సహాయక సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్‌తో వైఎస్ సునీత భేటీ

- వివేకా హత్య కేసులో న్యాయం చేయాలంటూ వినతి
- సాక్షుల మరణాలపై ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. సాయంత్రం 6:30 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకున్న ఆమె 35 నిమిషాలపాటు రాజ్‌భవన్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె తన తండ్రి వివేకానందరెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేశారని, ఈ కేసులో న్యాయం చేయాలని గవర్నర్‌ను కోరినట్లు సమాచారం. అంతేకాకుండా ఈ కేసులో సాక్షులు వరుసగా అనుమానాస్పదంగా మృతి చెందుతున్నారని, ఈ విషయంపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయించాలని ఆమె కోరారు. తండ్రి మరణించి ఆరేళ్లయినా ఇప్పటి వరకు సిబిఐ కోర్టులో కేసు ట్రయల్‌కు రాలేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. వివేకానందరెడ్డి హత్య వెనుక కొంతమంది పెద్దల హస్తం ఉందని, అందుకే ఈ కేసు ముందుకు సాగడం లేదని, కేసు విచారణ త్వరగా జరిగే విధంగా చూడాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. నిందితులందరూ బెయిల్‌పై బయట తిరుగుతున్నారని, ఈ నేపథ్యంలోనే ఈ కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా అనుమానాస్పదంగా మరణిస్తున్నారని, ఈ అంశంపై ఆందోళన చెందుతున్నట్లు గవర్నర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిసింది. గవర్నర్‌తో భేటీ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడకుండా అక్కడ నుంచి వెళ్లిపోయారు.

17న విశాఖకు సిఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ


సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్) 56వ స్థాపన దినోత్సవం సందర్భంగా 'సురక్షిత తీరాలు, సమృద్ధి భారతదేశం' అనే థీమ్‌తో చేపట్టిన దేశవ్యాప్త సైక్లోథాన్ 17న విశాఖకు రానుంది. భారత తీర ప్రాంతాన్ని పూర్తిగా చుట్టేలా ఈ సైకిల్ యాత్రను రూపొందించారు. హోం శాఖ మంత్రి అమిత్ షా మార్చి 7న తమిళనాడులోని అరక్కోణం నుండి ఈ సైకిల్ ర్యాలీని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సైక్లోథాన్ సోమవారం విశాఖకు చేరుకుంటుందని విశాఖ పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాలీకి సంప్రదాయ స్వాగతం అందించేందుకు బీచ్ రోడ్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రత పట్ల అవగాహన కల్పించడం, ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు వంటి ముప్పులపై వారికి సూచనలు ఇవ్వడం ఈ సైక్లోథాన్ ప్రధాన లక్ష్యమన్నారు. 18వ తేదీన ప్రత్యేక సెండ్-ఆఫ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి విపిటి చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ప్రధాన అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పథకాలు

- కార్మికులతో ముఖాముఖిలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, ప్రజలు తనపై బాధ్యత పెట్టారని.. అందరం కలిసికట్టుగా మంగళగిరిని అభివృద్ధి చేసుకుందామని మంత్రి నారా లోకేష్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆల్ఫా టీ స్టాల్ వద్ద పారిశుధ్య కార్మికులతో మంత్రి లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజధాని ప్రాంతం కావడంతో జనాభా పెరిగిందని, కార్మికులను, వాహనాల సంఖ్యను పెంచాలని, ప్రభుత్వ పథకాలు అందడంలేదని కార్మికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. మహిళా పారిశుధ్య కార్మికులకు మరుగుదొడ్ల సౌకర్యం, కార్మికులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని, ఐడి కార్డులు ఇవ్వాలని కోరారు.



మంగళగిరి ఆల్ఫా టి స్టాల్ వద్ద పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

ఈ సందర్భంగా లోకేష్ స్పందిస్తూ.. కార్మికులు, వాహనాల సంఖ్య పెంచుతామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంగళగిరిలో మొదటి విడతలో 6 మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని, భూగర్భ డ్రెయినేజీ, అండర్ వాటర్ పైప్ లైన్ నిర్మిస్తామని, జూన్ నాటికి పనులు ప్రారంభించి ఏడాదిన్నరలో పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చాల్సి ఉందని, మధ్యాహ్న భోజన పథకంలో మెనూ కూడా మార్చామని తెలిపారు. మంగళగిరిలో ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించి ఇస్తామని, 11 వేల మందిని అర్హులుగా గుర్తించామని, టిడ్కో గృహాల సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను మంత్రి లోకేష్ సత్కరించారు. అందరితో కలిసి ఫొటోలు దిగారు. సామాన్యుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లైనింగ్‌పనులు నిలిపేయాలి



- జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రధాన కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఇందిరా పార్క్ లో ఉన్న కల్లూరు సుబ్బారావు విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నాయకులు మాట్లాడుతూ, గత ఐదారు సంవత్సరాల నుండి హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీళ్లు వస్తున్నప్పటికీ ఆశించిన ప్రయోజనం నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కొన్ని చెరువులు మాత్రమే నీరు ఇస్తున్నారని, ఈ సంవత్సరము 27 టిఎంసిలు రాగా అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు 24 టీఎంసీలు వచ్చాయని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 2500 చెరువులు ఉండగా 89 చెరువులకు మాత్రమే నీరు ఇచ్చారని, ప్రతి సంవత్సరం ఈ విధంగా కొన్ని చెరువులకు మాత్రమే నీరు ఇస్తే ఆశించిన ప్రయోజనం నెరవేరదని పేర్కొన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నిర్దేశించిన విధంగా రాయలసీమలో ఆరు లక్ష ఎకరాలకు, ఉమ్మడి జిల్లాలో 3,45,000 వేల ఎకరాలకు నీరు ఇవ్వగలిగితేనే ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఈ దశలో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి నూరు టిఎంసిలను ఎత్తిపోతల ద్వారా కొత్త ఆయకట్టుకు నీరు ఇస్తేనే ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాలు వెడల్పు చేయకుండా లైనింగ్ చేయటం వల్ల ప్రయోజనం లేదని తెలిపారు. కావున హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను రద్దు చేయాలని కాలువను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు స్పందించాలన్నారు. పార్టీలకతీతంగా ఉద్యమ ఉద్యమించి ఉమ్మడి జిల్లాను రక్షించుకోవాలని జలసాధన సమితి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి గౌరవాధ్యక్షులు సీనియర్ అడ్వకేట్ రామచంద్రారెడ్డి, అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి, రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, జలసాధన సమితి నాయకులు ఫరూక్, జమీల్, అమానుల్లా, దాసరి హరి, తిప్పేస్వామి, నవీన్, పరిగి రాజేష్, ఎస్‌యుసిఐ నాయకులు గిరీష్, సిఐటియు నాయకులు రాము, బిఎస్‌పి నాయకులు కిష్టప్ప, పర్యావరణవేత్త భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ గంగిరెడ్డి, చైతన్య సంస్థ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కన్నప్ప జన్మస్థలిని దర్శించుకున్న హీరో విష్ణు

ప్రజాశక్తి,-రాజంపేట అర్బన్

పరమేశ్వరుడు పరమ భక్తుడైన కన్నప్ప జన్మస్థలి మండల పరిధిలోని ఊటుకూరులో శివ, పార్వతులతో పాటు కన్నప్పను దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని సినీ హీరో మంచు విష్ణు పేర్కొన్నారు. భక్త కన్నప్ప పాత్రలో విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న సందర్భంగా శనివారం కన్నప్ప జన్మ స్థలమైన ఊటుకూరు గ్రామంలో వెలసిన మీనాక్షి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని విష్ణు సందర్శించారు.

చర్లపల్లి మీదుగా పలు రైళ్లు శాశ్వత మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్లను శాశ్వత ప్రాతిపదికన చర్లపల్లి వద్ద అదనపు స్టాప్‌లతో చర్లపల్లి -అమ్మగూడ - సనత్ నగర్ మీదుగా వయా చర్లపల్లి - మౌలాలీ జి.క్యాబిన్ -దయానంద్ నగర్ బైపాస్ క్యాబిన్ (బైపాస్ సికింద్రాబాద్)లో దారి మళ్లించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో 18520 లోకమాన్య తిలక్ టెర్మినల్ - విశాఖపట్నం రైలు ఏప్రిల్ 22 నుంచి, 18519 విశాఖపట్నం - లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 18503 విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24 నుంచి, 20809 సంబల్పూర్-నాందేడ్ ట్రై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 18504 సాయినగర్ షిర్డీ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి, 20810 నాందేడ్- సంబల్పూర్ ఎక్స్‌ప్రెస్, 20811 విశాఖపట్నం-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి, 20812 నాందేడ్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 27 నుంచి మళ్ళించిన మార్గంలో నడుస్తాయి. కావున ఈ రైళ్లు భవిష్యత్తులో సికింద్రాబాద్ మీదుగా ప్రయాణం చేయవు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అధికారులు కోరారు.

లిహురి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

వాల్తేరు డివిజన్‌లోని నౌపడ-గుణుపూర్ మార్గంలో ఉన్న లిహురి స్టేషన్ వద్ద మార్చి 15 నుంచి 23 వరకు జరిగే డోలో యాత్ర ఉత్సవం సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు లిహురి స్టేషన్‌లో రెండు నిమిషాల తాత్కాలిక హాల్ట్‌ను ఇవ్వనున్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

మండుతున్న ఎండలు సీలేరులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి-సీలేరు

మార్చి రెండో నెల మధ్యలోనే ఎండలు మండుతున్నాయి. భానుడి ప్రతాపంతో జీకే వీధి మండలం సీలేరులో శనివారం మధ్యాహ్నం 40 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు నిప్పులు కక్కుతూ తన ప్రతాపాన్ని చూపించడంతో ప్రజలు ఎండ వేడికి తాళలేక అనేక అవస్థలు పడ్డారు. శనివారం నాటి ఎండకు ప్రజలు ఇండ్లలోంచి బయటికి వచ్చేందుకు సాహసించలేదు. ఏసీలుకు, కూలర్లకు పరిమితమయ్యారు. గురువారం 36 డిగ్రీలు, శుక్రవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా శనివారం ఉదయం 11 గంటలకి 34, ఒంటిగంటకు 36 డిగ్రీలు నమోదు కాగా, మధ్యాహ్నం 2.33 గంటలకు 40 డిగ్రీలకు చేరుకుంది. వేడితో పాటు ఉక్క పోత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఎండ వేడి తాళ లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. గతేడాది మార్చి నెలలో 36, 38 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది ఇప్పుడు 40 డిగ్రీలు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

వ్యవసాయ కార్మికోద్యమ నేత అంబికా ప్రసాద్ మిశ్రా కన్నుమూత



లక్నో : సిపిఎం సీనియర్ నాయకులు, ఉత్తరప్రదేశ్‌లో వ్యవసాయ కార్మికోద్యమ నేత అంబికా ప్రసాద్ మిశ్రా శనివారం కన్నుమూశారు. ఆయన వయస్సు 93 సంవత్సరాలు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) యుపి విభాగానికి అనేక సంవత్సరాలు నేతృత్వం వహించిన ఆయన పార్టీలోనూ పలు నాయకత్వ స్థానాల్లో పని చేసి ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అంబికా ప్రసాద్ మృతి పట్ల సిపిఎం కేంద్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

రైతు ఆత్మహత్యలు ఆందోళనకరం

- కేంద్రం ఒక పాలసీతో రావాలి
- ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్

ముంబయి : మహారాష్ట్రలో అన్నదాతల ఆత్మహత్యలపై ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత, కేంద్ర మాజీ మంత్రి శరద్ పవార్ స్పందించారు. మరత్వాడా, విదర్భ ప్రాంతాలలో రైతుల బలవన్మరణాలు బాధాకరమని తెలిపారు. ఈ విషయంలో సాగుదారులకు ఉపయోగపడేవిధంగా కేంద్రం ఒక విధానంతో ముందుకు రావాలని చెప్పారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలపై రాష్ట్ర సహాయ, పునరావాస శాఖ ఇటీవల ఒక డేటాను విడుదల చేసింది. మహారాష్ట్రలో 2024లో 2,635 మంది అన్నదాతలు సూసైడ్ చేసుకున్నట్టు వివరించింది. ఈ నేపథ్యంలో శరద్ పవార్ పై విధంగా స్పందించారు. "మరత్వాడా, విదర్భల నుంచి వచ్చిన సమాచారం బాధాకరం. వివిధ లొకేషన్ల నుంచి మేము కచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తాం. రైతులకు సహాయపడేలా కేంద్రం ఒక పాలసీని రూపొందించాలి" అని బారామతిలో శరద్‌పవార్ అన్నారు. వ్యవసాయం ఒక విప్లవాన్ని చూస్తున్నదని చెప్పారు. చెరుకు సాగులో కృత్రిమ మేధ(ఏఐ) వాడకం త్వరలోనే రానున్నదని కేంద్ర మాజీ వ్యవసాయ మంత్రి అయిన శరద్ పవార్ తెలిపారు.

సర్పంచ్ సంతోశ్ దేశ్‌ముఖ్ హత్యతో వార్తల్లోకెక్కి బీడ్‌పై ఆయన స్పందించారు. బీడ్ ఒకప్పుడు శాంతియుతమైన జిల్లా అని చెప్పారు. "బీడ్‌లో ప్రస్తుతమున్న పరిస్థితి గతంలో లేదు. ఇది ఒకప్పుడు శాంతియుతమైన జిల్లా. నా పార్టీవారే దాదాపు ఆరుగురు బీడ్ నుంచి ఎన్నికయ్యారు. అయితే, వారిలో కొందరు అధికారాన్ని దుర్వినియోగం చేయటంతో, ప్రస్తుత పరిణామాలను మనం చూస్తున్నాం" అని శరద్ పవార్ ఆందోళనను వ్యక్తం చేశారు.

కార్పొరేట్లకు భూ పందేరంపై హెచ్‌సియు విద్యార్థుల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

తరువాత ఈ భూములను కాజేయాలని ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. 2000 సంవత్సరం ప్రారంభంలో ఐఎంజి అకాడమికి ఎకరం 50 వేల రూపాయల అతి తక్కువ ధరకు 400 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం అప్పగించింది. స్పోర్ట్స్ అకాడమి ఏర్పాటు కోసం ఈ భూమిని ఇస్తున్నట్లు అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఆ దిశలో ఎటువంటి పనులు ప్రారంభం కాకపోవడంతో ఆ భూమలను తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం వాటిని యూనివర్శిటీకి అప్పగించలేదు. తాజాగా ఆ భూములను రియల్‌ఎస్టేట్, అభివృద్ధి అవసరాల పేరిట వేలం వేయాలని ఏకపక్షంగా నిర్ణయించింది. ఈ విషయం తెలియడంతో ఆగ్రహించిన విశ్వవిద్యాలయ విద్యార్థులు వర్శిటీ భూములను, వర్శిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

జీవ వైవిధ్య నిలయం

ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగించాలని భావిస్తున్న ఈ భూములు జీవ వైవిధ్యానికి నిలయమని విద్యార్థులు చెబుతున్నారు. ఈ భూముల్లో 734 పూల మొక్కల జాతులు, పది రకాల క్షీరదాలు, పదహేను రకాల సరీసృపాలు, 220 రకాల సరీసృపాలు, లెక్కలేనని కీటకాల జాతులు కనపడతాయని వారు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న కొండలు కూడా ప్రత్యేకమైన ఆకృతుల్లో పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకుంటాయి. ఇంత వైవిధ్యముండి, ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో ఉన్నఈ భూములన కాపాడటానికి బదులుగా తెగనమ్మడం ఎవరి ప్రయోజనాల కోసమని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

డీలిమిటేషన్‌తో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయొద్దు

- దామాషా వాటాను రాష్ట్రాలు కోల్పోరాదు
- కేంద్రానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హితవు
- స్టాలిన్ పోరాటానికి మద్దతు



తిరువనంతపురం : శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ (డీలిమిటేషన్) పేరుతో ప్రజాస్వామ్య విలువలను మంటగలపరాదని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయొద్దు అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న వైఖరికి విజయన్ సంఘీభావం ప్రకటించారు. ఈ నెల 22 నాటి సమావేశానికి మద్దతు తెలిపారు. దామాషా వాటాను రాష్ట్రాలు కోల్పోరాదని ఆయన అన్నారు. మొత్తంగా ఈ పునర్విభజన ప్రక్రియ పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

తమిళనాడు ఐటి, డిజిటల్ సేవల మంత్రి త్యాగరాజన్, లోక్‌సభ ఎంపి తంగపాండ్యన్ శుక్రవారం పినరయి విజయన్‌ను కలిసి 22 నాటి సమావేశానికి రావాల్సిందిగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తరపున ఆహ్వానించారు.

ఈ విషయంపై తాము పూర్తి సంఘీభావాన్ని ప్రకటించినట్లు కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం ఒక అధికార ప్రకటన జారీ చేసింది. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం విలువలను నీరుగార్చి కేంద్రం లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని చూస్తోందని విమర్శించింది. అనంతరం విజయన్ ఒక ప్రకటన జారీ చేశారు. ఏ రాష్ట్రానికైనా ప్రస్తుతమున్న సీట్ల దామాషా వాటా తగ్గకుండా ఈ ప్రక్రియను చేపట్టాలని కోరారు. ప్రొ రేటా ప్రాతిపదికన దక్షిణాది రాష్ట్రాలకు అదనపు సీట్లు వస్తాయని కేంద్రం చేస్తున్న వాదనలను పరిగణనలోకి తీసుకోబోమని చెప్పారు. ప్రొ రేటా పంపిణీకి ప్రస్తుతమున్న పార్లమెంటరీ సీట్ల శాతమా లేదా జనాభా ప్రాతిపదికనా అనేది కేంద్రం వివరంగా చెప్పడం లేదని అన్నారు. ఏదైనా కూడా దక్షిణాది రాష్ట్రాలు ప్రాతినిధ్యాన్ని నష్టపోతాయన్నారు. సమర్థవంతంగా జనాభా నియంత్రణను అమలు చేసిన రాష్ట్రాలను ఇలా శిక్షించరాదన్నారు.

స్వాతంత్ర్యం అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనాభా నియంత్రణ విధానాలకు అనుగుణంగా నడుస్తూ వచ్చిన రాష్ట్రాల పార్లమెంట్ దామాషా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం సముచితం కాదన్నారు. దక్షిణాది రాష్ట్రాల భయాందోళనలను కేంద్రం తొలగించాల్సి వుందని పినరయి విజయన్ డిమాండ్ చేశారు. ఏకపక్ష చర్యలు తీసుకోకుండా ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం స్ఫూర్తిని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు.

బిజెపివి మోసపూరిత ఆలోచనలు

- పునర్విభజనపై గళం విప్పిన పంజాబ్ సిఎం



చండీగఢ్: నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) ప్రతిపాదనపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నిరసన గళం వినిపించారు. కేంద్రంలోని అధికార బిజెపి అన్యాయమైన ఆట ఆడుతోందనీ, తాను గెలవలేని, సీట్ల సంఖ్యను పెంచుకోలేని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలను కుదించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను భగవవంత్ మాన్ వ్యతిరేకించడం ఇదే మొదటిసారి. పంజాబ్ సీఎం శనివారం విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఫోన్‌లో సంప్రదించానని చెప్పారు. "ఆయన ఇద్దరు మంత్రులను పంజాబ్‌కు పంపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసపూరిత ఎత్తుగడలు వేస్తోంది. తాను గెలవలేనీ, సీట్ల సంఖ్యను పెంచుకోలేని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలను తగ్గించడానికి ప్రయత్నిస్తోంది. జనాభాను నియంత్రించాలనీ, దేశంలో కుటుంబాల పరిమాణాన్ని తగ్గించాలని కేంద్రం ఓ విధానంగా పెట్టుకుంది. మరోవైపు కుటుంబ నియంత్రణను అమలు చేయని రాష్ట్రాలలో పార్లమెంటరీ, శాసనసభ స్థానాలను పెంచుతోంది. జనాభా విధానం ప్రాతిపదికన సీట్లు పెంచినా లేదా తగ్గించినా పంజాబ్‌పై ప్రభావం పడుతుంది. పంజాబ్‌లో ఒకటి రెండు సీట్లు పెరగవచ్చు. కానీ ఇతర రాష్ట్రాలలో పెరిగిన దామాషాలో పెరగవు" అని భగవంత్ మాన్ తెలిపారు. కాగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రమాణాలు పంజాబ్‌ను బలహీనపరుస్తాయన్న ఆందోళనలు ఉన్నాయని ఆప్ రాష్ట్ర ప్రతినిధి, ఎంపీ ఆనంద్‌పూర్ సాహిబ్ చెప్పారు. పార్లమెంటులో పంజాబ్ ప్రాతినిధ్యంపై ప్రభావం పడుతుందనీ, అంతేగాక భారత సమాఖ్య నిర్మాణానికి ముప్పుగా పరిణమిస్తుందని ఆయన అన్నారు.

ట్రంప్ దుష్ట పన్నాగాలను ఖండించండి

- వ్యవసాయ రంగంలో వారి జోక్యాన్ని ప్రతిఘటించాలి: ఎఐకెఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ దుష్ట సామ్రాజ్యవాద పన్నాగాలకు ముఖ్యంగా వ్యవసాయ రంగంలో వారి ఆలోచనలకు భారత ప్రభుత్వం లొంగిపోరాదని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగిపోయే ఏ ప్రయత్నాలైనా తీవ్రంగా ప్రతిఘటన తప్పదని హెచ్చరించింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణన్ ఒక ప్రకటన జారీ చేశారు. భారత్‌పై ట్రంప్ సర్కార్ సాగిస్తున్న టారిఫ్ యుద్ధానికి మోడీ ప్రభుత్వం బేషరతుగా లొంగిపోవడమంటే గతంలో భారత్ సాగించిన మహత్తర సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట సాంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని వారు విమర్శించారు. భారత్ సహా పలు ఇతర దేశాలపై ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌ల యుద్ధాన్ని ప్రకటించడమంటే అమెరికా సామ్రాజ్యవాదం యొక్క దోపిడీ స్వభావాన్ని పునరుద్ఘాటించడమేనని వ్యాఖ్యానించారు. దేశ ప్రయోజనాలపై రాజీ పడుతూ మోడీ సర్కార్ అమెరికా ప్రభుత్వానికి తలొగ్గుతోందని అన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి భారత వ్యవసాయ మార్కెట్‌పై కన్నేశారని, అనవసరమైన రక్షణ చర్యలతో వ్యవసాయరంగాన్ని నాశనం చేస్తున్నారని, ప్రైవేటు రంగానికి తలుపులు బార్లా తెరవాలని కోరుతు న్నారు. తగ్గించిన సుంకాలతో వ్యవసాయ ఉత్పత్తు లు, ప్రాసెస్ చేసిన వ్యవసాయ ఆహార ఉత్పత్తుల దేశీయ మార్కెట్ తలుపులను అమెరికా కంపెనీలకు తెరిచేవరకు వారు భారత్‌నుండి వచ్చే ఎగుమతుల పై అధిక టారిఫ్‌లు విధిస్తూ అమెరికాకు ఎగుమ తులను ఆపే ఉద్దేశ్యంతో వుంటారని ఎఐకెఎస్ విమర్శించింది. అమెరికాకు చెందిన బడా వ్యవసాయ పరిశ్రమలు, వ్యవసాయ వాణిజ్య శక్తులు భారత మార్కెట్‌లోకి బేషరతుగా ప్రవేశించేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని, ఇన్ని జరుగుతున్నా భారత ప్రభుత్వం మౌనంగా వుండడన్ని ఎఐకెఎస్ నేతలు ఖండించారు. ఈ వైఖరి చూస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్ట్ రాజకీయాలు బయటపడుతున్నాయని విమర్శించారు. వ్యవసాయ రంగంలో భారత ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ చెప్పడం చూస్తుంటే మన అంతర్గత వ్యవహారాల్లో వారి స్పష్టమైన జోక్యం అర్థమవుతోందని విమర్శించారు. ఏదిఏమైనా అమెరికా ఒత్తిళ్ళకు భారత ప్రభుత్వం దాసోహమనరాదన్నారు.

ట్రంప్ మరో షాక్

- 44 దేశాలపై పర్యాటక ఆంక్షలు?
- జాబితాలో పాక్, ఆఫ్ఘన్, భూటాన్
- పాక్షికంగా వీసాలను నిలిపివేసే అవకాశం
- సిద్ధమవుతున్న అమెరికా ప్రభుత్వం



ట్రంప్ సర్కార్ పర్యాటక ఆంక్షలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న అమెరికన్లు (ఫైల్)

న్యూఢిల్లీ : ఓ వైపు విదేశీ దిగుమతులపై సుంకాలు విధిస్తూ ప్రతీకార చర్యలకు దిగుతున్న అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ మరోవైపు 44 దేశాలపై పర్యాటక ఆంక్షలకు సిద్ధపడుతున్నారు. అక్రమ వలసలపై ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్ సహా పలు దేశాలకు అమెరికా వీసాలను పాక్షికంగా నిలిపివేయబోతున్నారు. ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడైనప్పుడు విధించిన ఆంక్షలతో పోలిస్తే ఇవి మరింత విస్తృతమైనవని అధికారులు తెలిపారు. ముస్లింలు అధికంగా నివసిస్తున్న ఏడు దేశాలపై అప్పట్లో ట్రంప్ పర్యాటక ఆంక్షలు విధించారు. పర్యాటక ఆంక్షలకు సంబంధించి అమెరికా భద్రతాధికారులు ఓ ముసాయిదాను రూపొందించారు. 60 రోజుల్లో 'దిద్దుబాటు చర్యలు' చేపట్టని పక్షంలో షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ప్రభుత్వంపై పాక్షిక ఆంక్షలు విధించడం జరుగుతుందని, ఆ దేశ పౌరులకు అమెరికా వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేస్తామని ఆ ముసాయిదా చెబుతోంది. ఈ మేరకు ఇప్పటికే అంతర్గత మెమో కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది.

అమెరికా నుంచి పర్యాటక ఆంక్షలు ఎదుర్కోబోతున్న దేశాల్లో తుర్క్‌మెనిస్తాన్, బెలారస్, వనువాటు కూడా ఉన్నాయి. వనువాటు పౌరసత్వం కోసం ఐపీఎల్ మాజీ ఛైర్‌పర్సన్ పెట్టుకున్న దరఖాస్తును ఆ దేశ ప్రధాని ఇటీవల తోసిపుచ్చిన విషయం తెలిసిందే. కాగా తమపై అమెరికా పర్యాటక ఆంక్షలు విధించబోతోందంటూ వస్తున్న వార్తలు ఊహాజనితమేనని పాకిస్తాన్ విదేశీ మంత్రిత్వ శాఖ ఈ వారం ప్రారంభంలో తెలిపింది. దీనిపై తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పాక్ విదేశాంగ ప్రతినిధి ఫాకత్ అలీ ఖాన్ చెప్పారు. తుర్క్‌మెనిస్తాన్‌లో పాకిస్తాన్ రాయబారిగా పనిచేస్తున్న కేకే అహ్సాన్ వాగన్ తమ దేశంలో ప్రవేశించేందుకు కొద్ది రోజుల క్రితం అమెరికా నిరాకరించింది. ఆయనను లాస్ ఏంజెల్స్ నుంచి వెనక్కి పంపింది. దీనిపై అమెరికా ఎలాంటి నిర్దిష్ట కారణం చెప్పనప్పటికీ ఆయన వీసా రిఫరెన్సులు వివాదాస్పదంగా ఉన్నాయని ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించినందునే వెనక్కి పంపారని తెలుస్తోంది.

రెడ్ లిస్ట్‌లో పది దేశాలు

అంతర్గతంగా జారీ చేసిన మెమో ప్రకారం పర్యాటక నిషేదం ఎదుర్కోనున్న దేశాలను రెడ్, ఆరంజ్, ఎల్లో మూడు గ్రూపులుగా విభజించారు. పది దేశాలను 'రెడ్ లిస్ట్'లో ఉంచారు. అంటే ఆయా దేశాల పౌరులకు వీసాల జారీని పూర్తిగా నిలిపివేస్తారు. ఆఫ్ఘనిస్తాన్, క్యూబా, ఇరాన్, లిబియా, ఉత్తర కొరియా, సోమాలియా, సూడాన్, సిరియా, వెనెజులా, యమన్ రెడ్ జాబితాలో ఉన్నాయి. రెండో గ్రూపులో ఐదు దేశాలు వున్నాయి. అవి ఎరిత్రియా, హైతి, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్‌లు. ఈ ఐదు దేశాలు కొన్ని మినహాయింపులతో పాక్షిక సస్పెన్షన్‌లను ఎదుర్కొనాల్సి వుంటుంది. అంటే పర్యాటక, విద్యార్థి వీసాలు, ఇతర ఇమ్మిగ్రెంట్ వీసాలు ప్రభావితమవుతాయి. ఇక మూడవ గ్రూపులో మొత్తంగా 26 దేశాలు వుంటాయి. వీటిలో బెలారస్, పాకిస్తాన్, తుర్కెమినిస్తాన్ తదితర దేశాలు వున్నాయి.

అక్టోబర్ నుంచి ఆకస్మిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతం పలికారు. అనంతరం ఎన్‌టిఆర్ పార్క్, కూరగాయల మార్కెట్, ఐక్యనగర్‌లో సిఎం పర్యటించారు. మున్సిపల్ కార్మికులతో కలిసి చెత్త ఊడ్చి ఎత్తిపోశారు. కార్మికులతో ఫొటోలు దిగారు. కూరగాయల మార్కెట్లో చెత్తను ఎరువుగా మార్చే యంత్రాలను పరిశీలించారు. ఐక్యనగర్ పి-4 విధానంలో పార్క్ అభివృద్ధి పనులపై అక్కడి జనంతో మాట్లాడారు. తణుకు బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రజావేదికకు విచ్చేసిన జనంతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ స్వరాంధ్ర-స్వచ్ఛాంధ్ర తన జీవిత ఆశయమన్నారు. విశాఖ, గుంటూరులో 30 మెగావాట్ల రెండు వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు, నెల్లూరు, రాజమండ్రిలో రూ.700 కోట్లతో 22 మెగావాట్ల విద్యుత్ తయారీ ప్లాంట్లు పెడుతున్నామన్నారు. రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త రోడ్లపై ఉందని, అందులో 51 లక్షల చెత్త తొలగింపు పూర్తయిందని, అక్టోబర్ నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేసేందుకు మంత్రి నారాయణ పనిచేస్తున్నారని వివరించారు. 2027 నాటికి వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వాడతామని, గతంలో మహిళల ఆత్మ గౌరవం పేరుతో మరుగుదొడ్లు నిర్మించామని, ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక నాలుగు లక్షల 60 వేల మరుగుదొడ్లు మంజూరు చేశామని, అందులో 72 వేల మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మిస్తామన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం...

స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఇళ్లతోపాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. శ్వాసకోశ వ్యాధులకు, కేన్సర్‌కు కారణం అవుతున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని పిలుపునిచ్చారు. తన అత్తగారు కేన్సర్‌తో చనిపో యారని, ఆవిడ పేరుతో బసవ తారకం కేన్సర్ ఆస్పత్రిని నెలకొల్పి వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. కేన్సర్ నివారణపై ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేందుకు ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుణ్ని సలహాదారుగా నియమించామన్నారు. గత పాలకులు ఏనాడైనా ప్రజల్లో తిరిగారా... పరదాలు కట్టుకున్నారని అన్నారు. చెత్తపైనా పన్ను వేశారని, రైతుల పట్టాదారు పుస్తకాలపై వారి బొమ్మలు వేసుకున్నారని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి లక్షల భూములు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారని, రికార్డులు తారుమారు చేశారని, ప్రయివేటు భూములు 22 'ఎ' కింద పెట్టేశారని, తప్పులు చేసి కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ ముసుగులో ఎదురు దాడి చేస్తున్నారని విమర్శించారు. స్వచ్ఛాంధ్రలో జిల్లాల వారీగా కేటాయించిన ర్యాంకులను సిఎం ప్రకటించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను, పరిశుభ్రతపై పాటుపాడుతున్న వారిని సత్కరించారు.

టిడిపి కార్యకర్తలతో ప్రత్యేకంగా సిఎం సమావేశం

ప్రజావేదిక ముగిసిన తర్వాత టిడిపి, కార్యకర్తలతో సిఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏ విధంగా ముందు కు సాగాలన్న దానిపై దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. పనిచేసినోళ్లకు నామినేటెడ్ పదవులు ఇస్తామని మరోసారి తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎ వినతి మేరకు తణుకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సిఎం పర్యటనలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, నారాయణ, పలువురు ఎంఎల్‌ఎలు, నాయకులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌ను అడ్డుకున్న పోలీసులు

తణుకు రూరల్ : స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్‌ను ఆ కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి హాజరైన సిఎం చంద్రబాబుకు స్వాగతంపలికేందుకు వెళుతుండగా పోలీసులు అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఉదయం తొమ్మిది గంటలకు ఎస్‌విఎం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు సిఎం చేరుకున్నారు. ఆయనకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అదే క్రమంలో సిఎంకు స్వాగతం పలికేందుకు పట్టాభిరామ్ వెళ్లేందుకు ప్రయత్నించగా జాబితాలో పేరు లేదని పోలీసులు గేటు వద్దే అడ్డుకున్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ జోక్యంతో ఆయనను పోలీసులు హెలిప్యాడ్ వద్దకు అనుమతించారు. సిఎంకు స్వాగతం పలికే జాబితాలో స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి పేరు లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ట్రంప్ ముఖం పైకి మైక్రోఫోన్

మేరీల్యాండ్ : అది మేరీల్యాండ్‌లోని ప్రిన్స్ జార్జ్ కౌంటీలో ఉన్న అమెరికా సైనిక స్థావరం. అక్కడ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత్రికేయులతో ముచ్చటిస్తున్నారు. గాజాపై వారు అడిగిన ప్రశ్నలకు ట్రంప్ సమాధానమిస్తుండగా ఓ మహిళా జర్నలిస్టు అత్యుత్సాహంతో తన వద్ద ఉన్న మైక్రోఫోన్‌ను ఆయన ముఖానికి దగ్గరగా తీసికెళ్లారు. అది ఆయన ముఖాన్ని దాదాపుగా తాకినట్లయింది.

ఈ హఠాత్పరిణామానికి ట్రంప్ చిరాకు పడుతూ కొంత అసహనం వ్యక్తం చేశారు. కనుబొమలను పైకి లేపారు.

వాషింగ్టన్ డీసీ నుండి బయలుదేరి వెళ్లేందుకు ట్రంప్ వైమానిక స్థావరానికి చేరుకున్నారు. గాజాలో నెలకొన్న పరిస్థితులపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఇంతలో ఆకస్మికంగా ఓ మైక్రోఫోన్ ఆయన ముఖం మీదకు వచ్చింది. దీనిపై ట్రంప్ చిరాకు ప్రదర్శించారు. ఆ వెంటనే సర్దుకొని నవ్వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో రిపబ్లికన్లు పెద్ద ఎత్తున స్పందించారు. ట్రంప్ ప్రదర్శించిన అసహనం, చిరాకు మీమ్స్‌కు విందు భోజనాన్ని అందించాయి.

అంకిత కేసులో బిజెపి నేతకు ప్రమేయం

- సిబిఐ దర్యాప్తునకు మహిళా సంఘాల డిమాండ్



ఇండియా న్యూస్‌నెట్‌వర్క్ - న్యూఢిల్లీ

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఒక హోటల్‌లో పనిచేస్తూ హత్యకు గురైన అంకిత కేసులో సదరు హోటల్ యజమాని బంధువు, బిజెపి నేతకు ప్రమేయమున్నట్లు విమర్శలొస్తు న్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కి కేసును అప్పగించి యువతి కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కేసు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని, పోలీసులు, ఉన్నత స్థాయిలోని రాజకీయ నేతలు ఎవరి ప్రమేయం వుండరాదని ఆ సంఘాలు కోరుతున్నాయి. ఈ మేరకు ఐద్వా, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు, ఎఐపిడబ్ల్యుఎ, ఎఐఎంఎస్‌ఎస్, పిడబ్ల్యు, పిఎంఎస్, ఐజెఎం సమన్వయ సంస్థలు ఒక సంయుక్త ప్రకటన జారీ చేశాయి.

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఒక హోటల్‌లో పనిచేస్తున్న అంకిత అనే యువతి హత్యకు గురైంది. ఆమె పనిచేస్తున్న హోటల్ బిజెపి నేతకు సన్నిహిత బంధువుది. హోటల్‌కు వచ్చిన ఒక విఐపి అతిథికి తనను ప్రత్యేకంగా సేవలందించాల్సిందిగా ఆదేశించారని, దానికి తాను తిరస్కరించానని ఆ యువతి తన స్నేహితుడికి తెలియచేసింది. ఈ నేపథ్యంలో తలెత్తిన పరిస్థితులతో ఆమె తీవ్రంగా భయాందోళనలకు గురై తనను త్వరగా వచ్చి హోటల్ నుండి తీసుకెళ్ళాల్సిందిగా వాట్సాప్ చాట్‌లో తన స్నేహితుడిని కోరింది. అయితే ఆ విఐపి అతిథి ఎవరో పోలీసులు వెల్లడించలేదు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్‌ఎ ఆదేశాలతో హోటల్‌లో ఆమె వున్న గదిని, మరికొన్ని భాగాలను కూలగొట్టారు. ఇంత జరిగినా పోలీసులు ఆమె వాట్సాప్ చాట్‌ను కాని, ఇతర సాక్ష్యాధారాలను కానీ పట్టించుకోలేదు. చార్జిషీట్‌లో నమోదు చేయలేదు. హోటల్ రూమ్‌ను, ఇతర సాక్ష్యాధారాలను నాశనం చేయడం చూస్తుంటే సామాన్య మహిళలపై లైంగిక హింసతో సహా అనేక రకాల దాష్టికాలకు పాల్పడిన ఉన్నత స్థాయి వ్యక్తులు వాటినుండి తప్పించుకున్న గత కాలపు సంఘటనలు గుర్తుకు వస్తున్నాయని ఆ ప్రకటనలో మహిళా సంఘాలు పేర్కొన్నాయి. సిబిఐ దర్యాప్తు జరిగితే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయనే ఆశతో అంకిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, కానీ అక్కడ కూడా నిరాశే ఎదురైందని ఆ ప్రకటన పేర్కొంది. కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ పరిస్థితుల్లో తక్షణమే సిబిఐ దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేయాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. నిర్దిష్ట కాలపరిమితిలో సక్రమంగా, శాస్త్రీయమైన రీతిలో దర్యాప్తు జరగాలని ఇది దేశ ప్రజలకు గల హక్కని పేర్కొన్నాయి. ఈ హక్కును దేశ అత్యున్నత న్యాయస్థానం పరిరక్షించాలని కోరాయి.

మహారాష్ట్రలో మళ్లీ లుకలుకలు

- అసంతృప్తి సెగలతో ఏక్‌నాథ్, అజిత్
- కాంగ్రెస్ నేత నానా పటోలా వ్యాఖ్యలతో ప్రకంపనలు

ముంబయి : మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి ప్రభుత్వంలో లుకలుకలు కొనసాగుతున్నాయి. శివసేన నేత, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఎన్‌సిపి నేత, మరో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఇద్దరు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు కాంగ్రెస్ నేత నానా పటోలా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఇద్దరు నేతలు మహాయుతిని వీడి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమితో జట్టుకడితే చెరో దఫా ముఖ్యమంత్రులు కావచ్చునని పటోలా ఆఫర్ చేశారు. 'షిండే, అజిత్‌లు ప్రతిపక్ష శిబిరంలోకి వచ్చేస్తే, వారు వంతుల వారీగా ముఖ్యమంత్రి స్థానాన్ని అధిష్టించవచ్చన్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి పాలక సంకీర్ణంలో, ప్రభుత్వంలో బాగాలేదు. ఉక్కిరిబిక్కిరిగా ఫీలవుతున్నారు. వారికి మేం మద్దతునిస్తాం. కావాలంటే వారిని ఇద్దరిని వంతుల వారీగా ముఖ్యమంత్రిని చేస్తాం. బిజెపి వారిలో ఎవరినీ ఎన్నటికీ సిఎంను చేయదని మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు నానా పటోలా శుక్రవారం వ్యాఖ్యానించారు. షిండే, ముఖ్యమంత్రి ఫడ్నవిస్‌ల మధ్య అసమ్మతి నెలకొందన్న ఊహాగానాల నేపథ్యంలో పటోలా వ్యాఖ్యలు వెలువడ్డాయి. షిండే ముఖ్యమంత్రిగా వున్నపుడు ప్రారంభించిన అనేక ప్రాజెక్టులు, పథకాలను రద్దు చేయడానికి ఫడ్నవిస్ ప్రయత్నిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అయితే పటోలా వ్యాఖ్యలు వెలువడిన వెంటనే షిండే, బిజెపి నేత చంద్రశేఖర్ బవాంకులేతో సహా పలువురు మహాయుతి నేతలు, పటోలాకు ఎదురు ఆఫర్ ఇచ్చారు. ఆయనే పాలక కూటమిలో చేరాలని ఆహ్వానించారు. మరోవైపు పటోలా వ్యాఖ్యాలకు కాంగ్రెస్ నేత విజయ్ వదెత్తివార్, సేన (యుబిటి) నేత సంజయ్‌రౌత్‌లు మద్దతునిచ్చారు.

'హిందీ'కి పవన్ వత్తాసుపై సర్వత్రా ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు. తమిళ రాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి కూడా ఉండొచ్చని చెప్పారు.

మాతృభాషను రక్షించుకోవడమంటే అమ్మను కాపాడుకోవడమే : ప్రకాశ్ రాజ్

విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ సైతం పవన్ కల్యాణ్‌కు తనదైన శైలిలో వరుస కౌంటర్లు ఇచ్చారు. హిందీ భాషను తమిళనాడు ప్రజల మీద రుద్దకండి అని చెప్పడమంటే ఆ భాషను ద్వేషించడం కాదని పవన్‌కు హితవు పలికారు. 'మీ హిందీ భాషను మా మీద రుద్దకండి, అని చెప్పడం ఇంకో భాషను ద్వేషించడం కాదు. స్వాభిమానంతో మా మాతృభాషను, మా తల్లిని కాపాడుకోవడం.. అని పవన్ కల్యాణ్ గారికి ఎవరైనా చెప్పండి ప్లీజ్..' అంటూ ప్రకాశ్ రాజ్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ పోస్టుపై జనసేన, బిజెపి శ్రేణులు విరుచుకుపడటంతో 'గెలిచేవరకూ జనసేనాని.. గెలిచిన తరువాత భజన సేనాని' అంటూ ప్రకాష్ ధీటుగా బదులిచ్చారు. గతంలో జనసేన అధినేతగా పవన్ కల్యాణ్ బిజెపి నేతలపైనా, ప్రత్యేకించి ఉత్తర భారత రాజకీయ నాయకులపై విరుచుకుడిన తీరును ఆయన ప్రస్తావించారు. ఉత్తర భారత రాజకీయ నేతలను ఉద్దేశించి ఎన్‌డిఎలో చేరక ముందు పవన్ కల్యాణ్ పెట్టిన 'హిందీ గో బ్యాక్' పోస్టును ప్రకాష్ రీ ట్వీట్ చేశారు. 'భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ఉత్తర భారత రాజకీయ నేతలు అవగాహన చేసుకోవాలని, గౌరవించాలని గత పోస్టులో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

త్రిభాషా సూత్రం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు డిఎంకె ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సభలో మాట్లాడుతూ.. 'మాట్లాడితే సంస్కృతాన్ని తిడతారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటారు.. అన్నీ దేశ భాషలే కదా.. తమిళనాడులో హిందీ రాకూడదని అంటూంటే నాకు ఒక్కటే అనిపించింది. తమిళ సినిమాలు హిందీలో డబ్ చేయకండి. డబ్బులేమో ఉత్తర ప్రదేశ్, బీహార్, చత్తీస్‌గఢ్ నుంచి కావాలి. హిందీని మాత్రం ద్వేషిస్తామంటే ఎలా? ఇదెక్కడి న్యాయం. తమిళనాడులో పెరిగినప్పుడు నేను వివక్ష అనుభవించాను. గోల్టీ గోల్టీ అని నన్ను అవమానించారు' అంటూ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

ప్యాకేజీ పేరుతో మోసం

(మొదటి పేజీ తరువాయి)

వల్ల లక్ష కోట్ల రూపాయల మేర విద్యుత్ భారాలు రాష్ట్ర ప్రజలపై పడనున్నాయని రాఘవులు తెలిపారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరితే ప్రభుత్వంపై జరి మానాలు వేస్తారని.. రద్దు సాధ్యం కాదని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం, మోసపూరితం అని రాఘవులు అన్నారు. కేంద్రంతోనే అగ్రిమెంట్ చేసుకున్నామని జగన్ చెప్పారని, టిడిపి కూటమి నేతలు కేంద్రాన్ని ఒప్పించి రద్దు చేయించలేరా? అని ప్రశ్నించారు. మోడీ ఒత్తిడి వల్లే చంద్రబాబు ఈ ఒప్పందాన్ని రద్దు చేయలేకపోతున్నారా? అని అన్నారు.

జనసేన సభలో పవన్ విచిత్ర వ్యాఖ్యలు

జనసేన ఆవిర్భావ సభలో చేగువేరా, కమ్యూనిస్టుల గురించి పవన్ చేసిన వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయని రాఘవులు పేర్కొన్నారు. చేగువేరా డాక్టర్ కాబట్టి అభిమానించానని, కమ్యూనిస్టు కాబట్టి తాను అభిమానించలేదని పవన్ అన్నారని, చేగువేరా డాక్టర్‌గా ఎక్కడ వైద్యం చేశారో పవన్ చెప్పాలన్నారు. చేగువేరా గొప్ప విప్లవకారుడని అందరికీ తెలుసన్నారు. సినిమాల్లో అయన బొమ్మలు పెట్టిన పవన్ యువతను రెచ్చగొట్టేలా మాట్లాడిన సంగతి ఎవ్వరూ మరిచిపోరని తెలిపారు. అబద్ధం కూడా అతికినట్లు ఉండాలన్నారు.

త్రిభాషా సూత్రం బలవంతం సరైంది కాదు


మూడు భాషలను రాష్ట్రాలపై రుద్దాలని కేంద్రం చూడడాన్ని, బెదిరింపులకు దిగడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాఘవులు తెలిపారు. త్రిభాష అమలు చేస్తేనే నిధులు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం లింకు పెట్టడం సరైంది కాదన్నారు. కేంద్రం తెచ్చే డీ లిమిటేషన్‌లో రాష్ట్రాల మధ్య సమతుల్యత దెబ్బతినకూడదని తెలిపారు. జనాభాను నియంత్రించే రాష్ట్రాలను దెబ్బతీయాలని కేంద్రం చూస్తోందన్నారు. సీట్ల నిష్పత్తి మారకుండా డీ లిమిటేషన్ చేయాలన్నది సిపిఎం విధానమని తెలిపారు. తమిళనాడు విషయంలో కేంద్రం వైఖరి రాజ్యాంగ విరుద్ధమన్నారు.



మీకోసం
దోశల పిండి బాగా పులిసిపోతే అందులో రెండు చెంచాల గోధుమపిండి కలపాలి.

జీవన సౌరభం
చేయాలన్న పట్టుదల, చేయగలను అన్న నమ్మకం ఉంటే అద్భుతాలు సాధ్యమే..

భావి శాస్త్రవేత్త



సీతాపురం ఊరిలో రాము ఆరవ తరగతి చదువుతున్నాడు. అతనికి సైన్స్ అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ కొత్త కొత్త విషయాలు తెలుసుకోవాలనే కోరికతో ఏవేవో ప్రయత్నాలు చేస్తాడు. అది గమనించిన ఉపాధ్యాయులు రాముని సైన్స్ ఎగ్జిబిషన్స్ లాంటి వాటికి పంపుతూ ప్రోత్సహిస్తున్నారు.

ఒకరోజు రాము వాళ్ల నాన్నతో బైక్‌పై వెళుతున్నాడు. అప్పుడు దారిలో ఒక యాక్సిడెంట్ జరిగింది. రెండు బైకులు ఢీకొన్నాయి. హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పింది. అయితే చాలా ప్రమాదాల్లో హెల్మెట్ వాడక పోవడం వల్ల ప్రాణాలు పోతున్నాయని చుట్టూ ఉన్న వాళ్లు అనుకోవడం రాము విన్నాడు. అప్పుడే 'ఏదైనా ప్రమాదం జరిగితే హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చు' అని సోషల్ టీచర్ తరగతి గదిలో చెప్పిన విషయం రాముకు గుర్తుకువచ్చింది.

ఈ ప్రమాదం జనాలు తిరిగే చోట జరిగింది కాబట్టి, ఎవరో ఒకరు వచ్చి సహాయం చేశారు. అదే ఎవ్వరూ లేని సమయంలో జరిగితే వాళ్లు ఎలా ప్రాణాపాయం నుండి తప్పించుకుంటారు. అలాంటి సమయంలో కూడా ప్రాణాలు కాపాడాలంటే ఇంకా మంచి హెల్మెట్ తయారు చేయాల'ని అనుకున్నాడు. ఆ తరువాత రోజు సైన్స్ టీచర్‌తో తన ఆలోచన చెప్పాడు. 'టీచర్, హెల్మెట్‌లో ఒక చిప్ అమర్చాలి. ప్రమాదం జరిగినప్పుడు అది 108 అంబులెన్స్‌కి సమాచారం అందించేలా ఏర్పాటు చేస్తే బాగుంటుంది' అని చెప్పాడు. రాముకి వచ్చిన ఆలోచన టీచర్‌కి బాగా నచ్చింది. 'నీ ఆలోచన చాలా బాగుంది రాము. భవిష్యత్‌లో నువ్వు గొప్ప శాస్త్రవేత్తవి అవుతావు' అని మెచ్చుకున్నారు. పిల్లలందరూ చప్పట్లతో రాముని అభినందించారు.



– బి.విశ్వ తేజ,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

ఒకరికొకరు



అడవిలో ఒక ఏనుగు ఉంది. ఒకరోజు అది దారిలో పోతుంటే ఒక అరటి చెట్టు కనబడింది. ఆకలిగా ఉన్న ఏనుగు చెట్టు దగ్గరకి వెళ్లి అరటి పండ్లు తిన్నది. మళ్లీ అడవిలో వెళుతుండగా దానికి చాలా దాహం వేసింది. నీటి కోసం అడవి అంతా వెతికింది. కానీ ఆ ఏనుగుకు నీళ్లు ఎక్కడా దొరకలేదు. అప్పుడే అటువైపు ఒక చీమ వచ్చింది. 'చీమ చీమ నాకు చాలా దాహం వేస్తుంది. దగ్గర్లో ఎక్కడైనా నీళ్లు కనబడ్డాయా' అని చీమని అడిగింది. 'ఇక్కడ దగ్గర్లోనే ఒక నది ఉంద'ని చీమ చెప్పింది.

ఏనుగు, చీమను తన తొండం మీద కూర్చోమంది. చీమ దారి చూపుతుండగా ఏనుగు నది వైపుకు వెళ్ళింది. నదిని చూడగానే ఏనుగుకి పట్టరానంత సంతోషం వేసింది. చీమను ఒడ్డు మీద కూర్చోబెట్టి నదిలోకి వెళ్ళి దాహం తీర్చుకున్నది.

ఆ రోజు నుండి ఏనుగు, చీమ స్నేహితులయ్యాయి. కొన్ని రోజుల తరువాత ఏనుగు, చీమ అడవిలో నడిచి వెళుతుండగా రెండిటికీ బాగా దాహం వేసింది. నది దగ్గరకి వెళ్లి నీళ్లు తాగుతూ తాగుతూ ఏనుగు తన తొండంతో నీళ్లని వేగంగా చిమ్మింది. ఆ వేగానికి అక్కడే ఒడ్డున ఉండి నీళ్లు తాగుతున్న చీమ ఎగిరి నదిలో పడింది. నదిలో పడ్డ చీమ నీళ్ళలో కొట్టుకుపోతున్నది. తనవల్లే చీమ నదిలో పడిపోయిందని ఎలాగైనా దాన్ని కాపాడాలనుకున్న ఏనుగు, పక్కనే ఉన్న చెట్టుకొమ్మని నదిలోకి ఒంచింది.

చీమ ఆ కొమ్మను ఆసరాగా చేసుకొని ఒడ్డుమీదికి వచ్చింది. తన ప్రాణాలు కాపాడినందుకు ఏనుగుకు చీమ కృతజ్ఞతలు చెప్పింది. 'మనమిద్దరం స్నేహితులం. ఒకరికొకరు సహాయం చేసుకోవడమే మన మధ్యన ఉండాలి. కృతజ్ఞత కాదు' అని ఏనుగు, చీమతో అంది. అప్పటి నుండి చీమ, ఏనుగు మధ్య స్నేహం మరింత బలపడి సంతోషంగా జీవించాయి.



– బౌరె కోమల్,
6వ తరగతి,
జెడ్‌పిఎస్ఎస్ లక్ష్మీపూర్,
ఆదిలాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ర్యాంకుల కన్నా జీవితం గొప్పది కదా!

చదువు జీవితంలో ఓ భాగం.. మనిషి జీవించడానికి తిండి, నీరు, గూడు ఎంత అవసరమో చదువూ అంతేకానీ జీవితమే చదువు కాదు. బాగా చదువుకుంటేనే, మంచి మార్కులొస్తేనే భవిష్యత్తు బాగుంటుందని ఆశ పడడం తప్పు కాదు.. కానీ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువు జీవితాలని పణంగా పెడుతోంది. అటు పిల్లలు, ఇటు తల్లిదండ్రులు ర్యాంకుల పరుగుపందెంలో సమిధలవుతున్నారు.

ఒక అంచనా ప్రకారం గడిచిన 20 ఏళ్లల్లో చదువు ఒత్తిడితో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులు లక్షల్లో ఉన్నారు. పోటీ ప్రపంచంలో తమ పిల్లలు వెనుకబడి పోతున్నారని ఒక పక్క తల్లిదండ్రులు, పాఠాలు తలకెక్కడం లేదని, చదువులో రాణించలేక పోతున్నామని మరోపక్క విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఈ ధోరణి ఎన్నో విపరీతాలకు దారితీస్తోంది.



సందర్భం : 1 ప్రస్తుత పోటీ ప్రపంచంలో తన పిల్లలు పోటీ పడలేకపోతున్నారని, వారికి భవిష్యత్తు లేదని ముక్కుపచ్చలారని ఇద్దరు పసిబిడ్డలను చంపి, తానూ ఆత్మహత్య చేసుకున్నాడు కాకినాడ సుబ్బారావు నగర్‌కి చెందిన ఓ తండ్రి.

సందర్భం : 2 గతేడాది, న్యూఢిల్లీకి చెందిన 20 ఏళ్ల అర్జున్ తన్వర్, చదువులో రాణించలేకపోతున్నానని తీవ్రంగా కలత చెంది, తన తల్లిదండ్రులను, తోడబుట్టిన అక్కని హత్య చేశాడు.

సందర్భం : 3 ఫస్ట్ క్లాసు మార్కులొచ్చే నవీన్, ఒక పరీక్షలో ఎదురింటి నవ్య కంటే రెండు మార్కులు తక్కువ వచ్చాయని ఆవేశంతో ఊగిపోతూ నవ్యని విచక్షణారహితంగా కొట్టాడు.

పై మూడు సందర్భాల్లోని వ్యక్తులు ఎంతో సౌమ్యులు, ఎదుటివారితో ఎంతో మర్యాదగా నడుచుకునేవారు. కేస్ 1లో ఆ తండ్రికి పిల్లలపై విపరీతమైన ప్రేమ ఉంది. కేస్ 2లో అమ్మానాన్న అంటే ఆ యువకుడికి ఎంతో గౌరవం. అక్క అంటే చాలా ఇష్టం. ఇక కేస్ 3లో పిల్లాడు చదువులో ఎప్పుడూ చురుకుగా ఉంటాడు. అయినా ఈ ముగ్గురూ ఎందుకు ఈ విపరీతాలకు పాల్పడ్డారు?

అమ్మానాన్న ఆలోచించాలి..

ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డా.అమరనాథ్ జాగర్లపూడి ఈ అంశంపై మాట్లాడుతూ ఎన్నో విషయాలను చర్చల్లోకి తీసుకొచ్చారు. 'విద్యారంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెరిగిన నాటినుండే ఈ విపరీతాలు మొదలయ్యాయి. ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతని విస్మరించింది. పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారు. వారికి సాధ్యం కానిది ఏదీ ఉండదు. అయితే వారి శక్తిసామర్థ్యాలను అంచనా వేయగలగాలి. ఇంట్లో తల్లిదండ్రులు, అధ్యాపకులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినప్పుడే అది సాధ్యం. కానీ చాలా ఏళ్లుగా పిల్లలు దీపం చుట్టూ పురుగుల్లా చదువు వెలుగులో మాడి మసైపోతున్నారు. దీనికి ప్రధాన కారణం తోటి పిల్లలతో మన పిల్లలను పోల్చడం. పక్కవాడి కంటే అర మార్కు తక్కువ వచ్చినా 'బాగానే చదివావు కదా! ఎందుకు తక్కువ తెచ్చుకున్నావు. ఇప్పుడు చూడు వాడికంటే తక్కువ ర్యాంకు వచ్చింది' అని పిల్లలను సతాయించే తల్లిదండ్రులు మనచుట్టూ చాలా మంది ఉన్నారు. ఇంకొంతమంది తల్లిదండ్రులు 'మేము ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నాం. మీకది అర్థం కావడం లేదు. సరిగ్గా చదవడం లేదు. మీ క్లాసులో ఆ పిల్లని చూడు. ఎంత బాగా చదువుతుందో. ఎప్పుడూ ఫస్ట్ క్లాసు తెచ్చుకుంటుంది. నీకసలు సిగ్గు లేదు' అని పిల్లలను ఎప్పుడూ అవమానించే అమ్మానాన్నలు బోలెడుమంది' అని తనకెదురైన ఎన్నో అనుభవాలను అమర్‌నాథ్ చెప్పారు.

'తల్లిదండ్రులు ఇలా ప్రవర్తించడానికి కారణమేంటి.. పిల్లల భవిష్యత్తు బాగుండాలనే కదా!' అని చాలామంది భావించవచ్చు. అయితే 'పిల్లలపై తరచూ ఈ ధోరణి చూపించడం వల్ల మనకు తెలియకుండానే పిల్లలను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాం. అది వాళ్లని తీవ్ర ఆత్మన్యూనతా భావానికి గురిచేస్తోంది. ఈ భావం రానురాను పిల్లలను తమని తాము శిక్షించుకునే స్థితికి గాని, ఎదుటివాళ్లకి హాని కలిగించే స్థితికి గాని తీసుకుపోతుంది' అని అమర్‌నాథ్ ఆవేదనగా చెబుతున్నారు.

పరువు పోతుందని..

ఒత్తిడితో కూడిన చదువు పిల్లలనే కాదు, తల్లిదండ్రులను కూడా ఆత్మన్యూనతా భావానికి గురిచేస్తోంది. 'ఎక్కువ ఫీజులు కట్టే స్కూల్లో చేర్పిస్తేనే పిల్లలు బాగా చదువుతారని చాలామంది భావిస్తారు. ఈ కారణంగానే సంపాదించిన దాంట్లో మూడొంతులు చదువుకే ఖర్చుపెడతారు. ఇలా ఎన్నో త్యాగాలు చేస్తున్న తల్లిదండ్రులు, చుట్టాల్లో పరువు పోకుండా ఉండాలంటే పిల్లలు మంచి ర్యాంకులు సాధించాలని కలలు కంటారు. 'ఒకవేళ తక్కువ మార్కులు వచ్చాయో బంధువుల్లో పరువు పోతుంది. వాళ్లకి ముఖం చూపించలేం. ఈసారి పరీక్షల్లో బాగా మార్కులు తెచ్చుకో. లేకపోతే మేం అవమానాలు పడాలి' వంటి మాటలతో తాము ఆత్మన్యూనతకి గురై పిల్లలని కూడా అభద్రతకి లోనుచేస్తున్నారు' అని అమర్‌నాథ్ అంటున్నారు.

పైన జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా చూస్తే డాక్టర్ చెప్పిన విషయాలు ఇంకా స్పష్టంగా అర్థమవుతాయి.

కాకినాడ ఘటనలో మృతుడు కేంద్రప్రభుత్వ ఉద్యోగి, నెలకు పెద్ద మొత్తంలో జీతం తీసుకుంటున్న తండ్రి. తన ఇద్దరు బిడ్డలు 1వ తరగతి, యుకెజి చదువుతున్నారు. పిల్లలను బాగా చదివించాలనుకుని అధిక మొత్తం చెల్లించి పెద్ద స్కూల్లో చేర్పించాడు. అయితే ఏడాదికి చెరో లక్ష ఫీజు భరించడం ఆ తండ్రికి భారమైంది. చేసేదేమీ లేక పిల్లలిద్దరినీ స్కూలు మార్పించాడు. ఈ పరిస్థితే ఆ తండ్రిని తీవ్ర ఆత్మన్యూనతకి గురిచేసింది. పిల్లలను తాను కోరుకున్న స్కూల్లో చదివించలేకపోతున్నానని ఎంతో ఆవేదన చెందాడు. ఆ బాధ అతన్ని విచక్షణ కోల్పోయేలా చేసింది. 'ఇక్కడ ఆ తండ్రి చేసిన అఘాయిత్యం ఒక్కటే కాదు.. విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన కార్పొరేట్ సంస్కృతి కూడా చూడాలి' అంటున్నారు అమర్‌నాథ్.

ఢిల్లీ కేసు విషయానికొస్తే.. అర్జున్‌కి చిన్నప్పటి నుండి బాక్సింగ్ అంటే ఇష్టం. అతని అక్క చదువులో బాగా రాణించేది. కానీ తండ్రి ఎప్పుడూ అక్కతో పోల్చుతూ, అర్జున్‌ని అవమానపరిచేవాడు. 'బిడ్డ బాగుకోసమే' అని ఆ తండ్రి భావించి వుండవచ్చు. కానీ ఆ ధోరణి అర్జున్‌లో విపరీతమైన మార్పుని తీసుకొచ్చింది. 'అర్జునే హత్య చేశాడ'ని పోలీసులు చెబితే అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అర్జున్ చాలా మంచి పిల్లవాడు. తల్లిదండ్రులతో, అక్కతో ఎంతో ప్రేమగా ఉండేవాడు. 'పిల్లాడికి ఇష్టమైన రంగం వైపు ప్రోత్సహించకుండా ఆ తండ్రి చదువుపైనే దృష్టి పెట్టమని బలవంతం పెట్టాడు. పైగా అక్కతో పోల్చుతూ పదే పదే అవమానించాడు. ఈ ధోరణే అర్జున్‌ని దోషిని చేసింది' అంటున్న డాక్టర్ మాటలు ఆలోచించాల్సిన విషయాలు.

ఇక మూడవ కేసులో నవీన్ చదువులో చురుకుగా ఉంటున్నా అతని తల్లి మాత్రం 'తన కొడుకు ఎందులోనూ తక్కువ కాకూడదు' అని భావించింది. ఆ భావనతోనే నవీన్ ఎంత మంచి మార్కులు తెచ్చుకున్నా తోటి పిల్లలతో పోల్చి తక్కువ చేసేది. ప్రతిసారీ ఇలానే జరుగుతుంటే నవీన్ తట్టుకోలేకపోయాడు. అతనిలో నవ్యపై తెలియకుండానే ద్వేషం పెరిగిపోయింది. ఆ ద్వేషం అతనితో చేయరాని పనులు చేయించింది. నవీన్, నవ్య తల్లిదండ్రులు విద్యావంతులు. నవీన్ కూడా 'చాలా మంచి పిల్లవాడు' అని అందరూ అంటారు. 'ఇక్కడ నవీన్ తల్లి తను ఆత్మన్యూనతకి లోనై నవీన్‌ని కూడా రెచ్చగొట్టింది. ఫలితంగానే ఈ విపరీతానికి నవీన్ పాల్పడ్డాడ'న్న డాక్టర్ విశ్లేషణ ప్రతి తల్లీదండ్రీ గుర్తుంచుకోవాల్సింది.


సంభాషణ : జ్యోతిర్మయి



భారతదేశంలో విద్యావ్యవస్థ పూర్తిగా కార్పొరేట్‌మయమైంది. ప్రైవేటువాళ్లకి పిల్లల ర్యాంకులే కావాలి. జీవితాలు అవసరం లేదు. విదేశాల్లో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వమే విద్యనందిస్తోంది. ఆయా దేశాల్లో ఇక్కడిలా పిల్లలపై చదువు ఒత్తిడి లేదు. తల్లిదండ్రులకు కూడా ర్యాంకుల గోల లేదు. దీంతో విద్యారంగం ఎంతో ప్రశాంతంగా, ప్రతిభావంతంగా అభివృద్ధి చెందుతోంది. మనదేశంలో ఆవిధమైన మార్పు వస్తేనే ఈ విపరీతాలకు అడ్డుకట్ట పడుతుంది.

– డా.అమరనాథ్ జాగర్లపూడి,
ఎంఎస్‌సి సైకాలజీ అండ్ పిజిడిజిసి,
98495 45257.

'రాబిన్ హుడ్' డేవిడ్ వార్నర్



ఆస్ట్రేలియా ప్రముఖ బ్యాట్స్ మెన్ డేవిడ్ వార్నర్ టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో వస్తున్న 'రాబిన్ హుడ్' చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆ విషయాన్నీ ప్రకటిస్తూ డేవిడ్ వార్నర్ ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'బౌండరీ నుంచి బాక్సాఫీస్' కు వస్తున్న వార్నర్‌కు భారత సినిమాకు స్వాగతం అనే ట్యాగ్ లైన్ పోస్టర్‌ను జత చేసారు. నితిన్, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది.

21న 'ది సస్పెక్ట్'



రుషి కిరణ్, శ్వేత, రూప, శివ యాదవ్, రజిత, ఏకెన్ ప్రసాద్, మృణాల్ కీలక పాత్రల్లో నటించిన 'ది సస్పెక్ట్' సినిమా టెంపుల్ టౌన్ టాకీస్ సమర్పణలో ప్రొడ్యూసర్ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. రాధాకృష్ణ తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 21న ఎస్‌కెఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర, తెలంగాణలో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను వీఎన్ ఆదిత్య విడుదల చేశారు. 'చిన్న చిత్రానికైనా పెద్ద చిత్రానికైనా పడే కష్టం ఒక్కటే. మేము ఈ సినిమాను అందరికీ నచ్చేలా మంచి సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్‌గా రూపొందించాం. ఒక అమ్మాయి హత్యకు కారకులైన వారిని పట్టుకునే క్రమంలో సాగే చిత్రమిది. కొత్త ఆర్టిస్టులైనా ఎంతో అనుభవం ఉన్న వారిలా బాగా యాక్ట్ చేశారు. ఈ నెల 21న విడుదల అవుతున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని దర్శకుడు కోరారు.

తెల్లగా ఉంటే చాలు..



మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల తాజాగా ఓ ఇంటర్వ్యూలో టాలీవుడ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడారు. 'నేను బ్యాడ్మింటన్ ఆడే టైమ్‌లో నాకు చాలా సినిమా అవకాశాలు వచ్చాయి. కానీ నేను నో చెప్పాను. మన తెలుగు సినిమాల్లో నటించాలంటే తెల్లగా ఉంటే సరిపోతుంది. ఆటోమేటిక్‌గా అవకాశాలు వచ్చేస్తాయి. నాకు అలా బోలెడన్ని ఛాన్సులు వచ్చినా చేయలేదు. కానీ నితిన్ కోసం గుండెజారి గల్లంతయ్యిందే సినిమాలో స్పెషల్ సాంగ్ చేశాను. లక్కీగా అది మంచి హిట్ అయింది. కానీ ఇప్పుడు దాని గురించి మాట్లాడాలంటే కాస్త ఇబ్బందిగా ఉంటుంది' అంటూ గుత్తా జ్వాల మాట్లాడారు.

నా పక్కన చేయనన్నారు



సప్తగిరి ప్రధాన పాత్రలో నటించిన కొత్త చిత్రం 'పెళ్ళి కాని ప్రసాద్'. అభిలాష్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రియాంక శర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మార్చి 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం చిత్రబృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఇందులో పాల్గొన్న సప్తగిరి తన కెరియర్ గురించి మాట్లాడారు. చాలామంది హీరోయిన్స్ ఈ కథను రిజెక్ట్ చేశారని అన్నారు. సప్తగిరి కమెడియన్.. కాబట్టి, ఆయన పక్కన మేము యాక్ట్ చేయమన్నారని కూడా చెప్పారు. 'పెళ్ళి కాని ప్రసాద్' అనే సినిమా గురించి పెద్ద పరీక్ష రాశాం. ఇందులో నా నటనకు నేనే 100 మార్కులు వేసుకున్నా. మీ నుంచీ మంచి మార్కులు వస్తాయని ఆశిస్తున్నా. మార్చి 21న మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే సినిమా చూశాను. బాగా వచ్చింది. కమెడియన్ల పక్కన నటించడానికి హీరోయిన్స్ దొరకడం చాలా కష్టం. ఇందులో నాకు జోడీగా యాక్ట్ చేసినందుకు ప్రియాంక శర్మకు ధన్యవాదాలు. మా సినిమా టీజర్, ట్రైలర్ విడుదల చేసిన ప్రభాస్, వెంకటేశ్‌కు ధన్యవాదాలు' అని సప్తగిరి తెలిపారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మించారు.

'కాలమేగా కరిగింది' ట్రైలర్ విడుదల



వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'కాలమేగా కరిగింది'. ఈ సినిమాను మరే శివశంకర్ నిర్మిస్తున్నారు. శింగర మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. పొయెటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విడుదల చేస్తున్నారు. తాజాగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. గత జ్ఞాపకాలను వెతుక్కుంటూ ఓ యువకుడు తన పాఠశాల బాట పట్టడమే ఈ చిత్రంలోని ప్రధానాంశం.

ఢిల్లీకి మూడోసారి నిరాశే..

- **డబ్ల్యుపిఎల్ ఉత్కంఠ ఫైనల్లో ముంబయి చేతిలో ఓటమి**
- **విజేతకు రూ.6కోట్లు, రన్నరప్‌కు రూ.3కోట్లు ప్రైజ్‌మనీ అందజేత**

ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) టైటిల్‌ను ముద్దాడాలన్న ఢిల్లీ కలలు మరోసారి కల్లలయ్యాయి. 2023, 2024 సీజన్‌లలో ఫైనల్‌కు చేరి రన్నరప్‌లకే పరిమితమైన ఢిల్లీ జట్టు.. శనివారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన సీజన్-3 ఫైనల్లోనూ ఎనిమిది పరుగుల తేడాతో ఓటమిపాలైంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ భరితంగా సాగిన టైటిల్ సంగ్రామంలో ముంబయి చేతిలో ఢిల్లీ ఓటమిపాలైంది. ఛేదనలో భాగంగా చివరి 3ఓవర్లలో 29పరుగులు చేయాల్సిన ఢిల్లీని స్కీవర్ బ్రంట్ వరుస బంతుల్లో మారిజానే కాప్(40), శిఖా పాండే(0)ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత మాథ్యూస్ ఢిల్లీ ఆల్‌రౌండర్ మిన్ను మణి ఔటైంది. మరోవైపు నిక్కి ప్రసాద్(25నాటౌట్) ధాటిగా ఆడినా.. చివరి ఓవర్లో స్కీవర్ బ్రంట్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ గెలుపు తీరాలకు చేరలేకపోయింది. మారిజన్నె క్యాప్(40), జెమ్మీమా రోడ్రిగ్స్(30), నికీ ప్రసాద్(25నాటౌట్) మినహా మిగతా బ్యాటర్లు క్రీజ్ ముందు నిలవలేక పోయారు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో నాట్ స్కీవర్ బ్రంట్ మూడు, అమెలా కేర్ రెండు, షబ్నం ఇస్మాయిల్, హేలీ మ్యాథూస్, సైకా ఇసాకీ చెరో వికెట్ తీశారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. సారథి హర్మన్ ప్రీత్ కౌర్ 66, నాట్ స్కివర్ బ్రంట్ 30 పరుగులు చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మారిజన్నె క్యాప్, జెస్ జొన్నాసెన్, శ్రీ చరణి రెండేసి వికెట్లు, అనాబెల్ సూథర్‌లాండ్ ఒక వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్మన్ ప్రీత్‌కు, సిరీస్



డబ్ల్యుపిఎల్ టైటిల్‌తో కెప్టెన్ హర్మన్ ప్రీత్

స్కోర్‌బోర్డు...

ముంబయి ఇండియన్స్ మహిళల ఇన్నింగ్స్: యాస్టికా భాటియా (సి)రోడ్రిగ్స్ (బి)మారిజానే కాప్ 8, మాథ్యూస్ (బి)కాప్ 3, స్కీవర్ బ్రంట్ (సి)మిన్ను మణి (బి)ఛరాణి 30, హర్మన్‌ప్రీత్ కౌర్ (సి)కాప్ (బి)సథర్లాండ్ 66, అమేలియా కెర్ర్ (సి)షెఫాలీ వర్మ (బి)జొనాసెన్ 2, సజీవన్ సజన (ఎల్‌బి)జొనాసెన్ 0, కమలిని (స్టంప్)బ్రైస్ (బి)ఛరాని 10, అమన్‌జ్యోత్ కౌర్ (నాటౌట్) 14, సంస్కృతి గుప్తా (నాటౌట్) 8, అదనం 8. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 149పరుగులు. **వికెట్ల పతనం:** 1/5, 2/14, 3/103, 4/112, 6/112, 6/118, 7/132 **బౌలింగ్:** మారిజానే కాప్ 4-0-11-2, శిఖా పాండే 4-0-29-0, సథర్లాండ్ 4-0-29-1, జొనాసెన్ 3-0-26-2, ఛరాని 4-0-43-2, మిన్ను మణి 1-0-10-0.

ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (బి)స్కీవర్ బ్రంట్ 13, షెఫాలీ వర్మ (ఎల్‌బి)ఇస్మాయిల్ 4, జొనాసెన్ (సి)యాస్టికా భాటియా (బి)అమేలియా కెర్ర్ 13, జెమీమా రోడ్రిగ్స్ (సి అండ్ బి)అమేలియా కెర్ర్ 30, సథర్లాండ్ (స్టంప్)యాస్టికా భటియా (బి)ఇస్మాయిల్ 2, మారిజానే కాప్ (సి)మాథ్యూస్ (బి)స్కీవర్ బ్రంట్ 40, బ్రైస్ (రనౌట్) సంస్కృతి గుప్తా/యాస్టికా భాటియా 5, నిక్కి ప్రసాద్ (నాటౌట్) 25, శిఖా పాండే (బి)స్కీవర్ బ్రంట్ 0, మిన్ను మణి (సి)సజన (బి)మాథ్యూస్ 4, ఛరాని (నాటౌట్) 3, అదనం 2. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 141 పరుగులు. **వికెట్ల పతనం:** 1/15, 2/17, 3/37, 4/44, 5/66, 6/83, 7/123, 8/123, 9/128, **బౌలింగ్:** ఇస్మాయిల్ 4-0-15-1, స్కీవర్ బ్రంట్ 4-0-30-3, మాథ్యూస్ 4-0-37-1, కెర్ర్ 4-0-25-2, శిఖా ఇషికా 4-0-33-1.

నితీశ్ కుమార్ రెడ్డి ఫిట్



బెంగళూరు: ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఫిట్‌నెస్ సాధించాడు. వెన్ను నొప్పితో బాధపడుతున్న నితీశ్.. ఫిట్‌నెస్ సాధించినట్లు సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) శనివారం వెల్లడించింది. దీంతో అతడు త్వరలోనే హైదరాబాద్ సన్‌రైజర్స్ ఫ్రాంచైజీతో కలవనున్నాడు. క్రికెటర్ నితీశ్ ఇటీవల జరిగిన ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన నితీశ్.. ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ సందర్భంగా గాయపడ్డాడు. దీంతో బెంగళూరులోని నేషనల్ అకాడమీలో ఫిట్‌నెస్ టెస్ట్‌కు హాజరుకాగా.. యో-యో టెస్టులో కూడా అతను పాసయ్యాడు. ఫిజియో అతనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇంగ్లండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో ఆడినా.. దాంట్లో అతను బౌలింగ్ కానీ, బ్యాటింగ్ కానీ చేయలేదు. ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టు.. నితీశ్ రెడ్డిని రూ.6 కోట్లకు కొనుగోలు చేసింది. గత సీజన్‌లో అతను 13 మ్యాచుల్లో 303 పరుగులు చేశాడు. అతని స్ట్రయిక్ రేట్ 143గా ఉంది.

బ్రూక్స్ స్థానంలో బ్రెవీస్..?

ఐపీఎల్-2025 ప్రారంభానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వ్యక్తిగత కారణాలతో తప్పుకోగా.. అతని స్థానంలో దక్షిణాఫ్రికా విధ్వంసం ఆటగాడు డెవాల్డ్ బ్రెవీస్‌ను తీసుకోనుంది. ఐపీఎల్-2025 మెగా వేలంలో రూ. 75 లక్షల బేస్‌ప్రైస్‌తో వచ్చిన బ్రెవిస్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. అయితే ఆ తర్వాత జరిగిన సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో 21 ఏళ్ల బ్రెవిస్ దుమ్ములేపాడు.

మాస్టర్స్ క్రికెట్ టైటిల్ పోరు నేడు

ఫైనల్లో వెస్టిండీస్‌తో తలపడనున్న భారత్

రాయ్‌పూర్: అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ఆటగాళ్ల మధ్య జరిగే మాస్టర్స్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనుంది. శుక్రవారం జరిగిన రెండో సెమీస్‌లో వెస్టిండీస్ జట్టు 6పరుగుల తేడాతో శ్రీలంకపై సంచలన విజయం సాధించింది. తొలుత బ్రయాన్ లారా(41), రామ్‌దిన్(50నాటౌట్), వాల్టన్(31) రాణించడంతో వెస్టిండీస్ జట్టు 179పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 173పరుగులే చేసింది. గుణరత్నే(66), తరంగ(30), ఇసురు ఇదాన(21) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో వెస్టిండీస్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. విండీస్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' టినో బెస్ట్ (4/27) అత్యుత్తమంగా రాణించగా.. డ్వేన్ స్మిత్ రెండు, ఆష్లే నర్స్, జెరోమ్ టేలర్, లెండిల్ సిమ్మన్స్ ఒక్కో వికెట్ తీశారు. మాస్టర్స్ లీగ్‌కు ఈ ఏడాది శ్రీకారం చుట్టారు. ఇండియా మాస్టర్స్, శ్రీలంక మాస్టర్స్, ఇంగ్లండ్ మాస్టర్స్, సౌతాఫ్రికా మాస్టర్స్, ఆస్ట్రేలియా మాస్టర్స్, వెస్టిండీస్ మాస్టర్స్ జట్లు ఇందులో భాగమయ్యాయి. తొలి సెమీస్‌లో ఇండియా మాస్టర్స్ 94పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68